Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU




అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 290 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 3 - 7 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# ఆంధ్రప్రదేశ్ వేదికగా అమలులోకి వచ్చిన వీబీ జీ రాం జీ

## - తొలి కార్యక్రమంగా ఫారం పాండ్‌కి శంకుస్థాపన చేసిన కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ - ప్రత్యేక ఆకర్షణగా డ్రెయిన్ నమూనా ప్రదర్శన









**రైల్వే కోడూరు, (రాజధాని వార్తలు):** వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ్ చట్టం ఆంధ్రప్రదేశ్ వేదికగా జాతీయ స్థాయిలో అమలులోకి వచ్చింది. తిరుపతి జిల్లా, రైల్వే కోడూరు నియోజకవర్గం పరిధిలోని ముక్కావారిపల్లెలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి వర్యులు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ఫారం పాండ్‌కు శంకుస్థాపన చేసి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. వీబీ జీ రాం జీ చట్టంలో గ్రామీణాభివృద్ధి, గ్రామీణ ప్రజల అభివృద్ధితోపాటు రైతుల కోసం ప్రత్యేక కార్యాచరణ ఉంటుందని తెలిసేలా ఈ పంట కుంట తవ్వకం పనులకు శ్రీకారం చుట్టారు.

**పంచాయతీపాలనలో ఆంధ్రప్రదేశ్ అద్భుత విజయాలు**

అనంతరం వీబీ జీ రాం జీ పథకం కింద కలప ఉత్పత్తి చేసే టేకు, మద్ది, వేప, యూకలిప్టస్ తదితర 10 రకాల మొక్కలను శివరాజ్ సింగ్ చౌహాన్, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, ఇతర కేంద్ర, రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా నాటారు. పచ్చదనం పెంపుతో పర్యావరణ పరిరక్షణతోపాటు పంచాయతీల ఆదాయం పెంచేందుకు పవన్ కళ్యాణ్ రూపొందించిన ప్రత్యేక కార్యాచరణలో కలప ఉత్పత్తి, వుడ్ బ్యాంకుల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అందుకు సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రివర్యులకు తెలియజేశారు. అనంతరం సభా ప్రాంగణానికి సమీపంలో ఏర్పాటు చేసిన మ్యాజిక్ డ్రెయిన్ నమూనాను చూపించి ఆ కాన్సెప్ట్‌ను శివరాజ్ సింగ్ చౌహాన్‌కి వివరించారు. మురుగునీటి నిర్వహణలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తీసుకువచ్చిన వినూత్న ఆవిష్కరణ అయిన ఈ మ్యాజిక్ డ్రెయిన్ మొత్తం మూడు లేయర్లలో నిర్మాణాన్ని ప్రదర్శించారు. మ్యాజిక్ డ్రెయిన్లలో ఎర్త్ వర్క్, మొదటి లేయర్‌లో 30 సెంటీమీటర్ల మందంతో వేసిన 100 ఎంఎం కంకర, రెండో లేయర్‌లో వేసిన 40 ఎంఎం కంకర, మూడో లేయర్‌లో వేసిన 20 ఎంఎం కంకరతో నింపను న్నట్టు తెలిపారు. మ్యాజిక్ డ్రెయిన్ పని తీరుని వివరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సాధించిన విజయాల సమాహారంతో ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని తిలకించారు. మోడల్ పంచాయతీలు, జీరో లిక్విడ్ డిశ్చార్జ్ పంచాయతీలు, జియో ట్యాగింగ్ వంటి పారదర్శక విధానాలతో సాధించిన ప్రగతిని అతిథులంతా వీక్షించారు. అనంతరం వేదిక మీద ఏర్పాటు చేసిన వీబీ జీ రాంజీ శిలాఫలకాన్ని శివరాజ్ సింగ్ చౌహాన్ ఆవిష్కరించారు. లబ్దిదారులైన ఉపాధి శ్రామికులకు వీబీ జీ రాం జీ కార్డులు పంపిణీ చేశారు. అనంతరం పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ఓపీఈడీ బుక్ లెట్‌ను ఆవిష్కరించారు. పోర్టల్‌ను శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్, సమాచార ప్రసార, గ్రామీణాభివృద్ధి శాఖల సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మం త్రులు సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్ రైల్వే కోడూరు శాసన సభ్యులు అరవ శ్రీధర్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి రోహిత్ కన్సాల్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ శ్రీ కృష్ణ తేజ పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర 2047 ఎకనమిక్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్ పేరుతో కెపాసిటీ బిల్డింగ్‌పై నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సదస్సుకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు






**తిరుపతి, (రాజధాని వార్తలు):** ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో తిరుపతిలో ఇవాళ, రేపు రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహణ. వర్క్ షాప్‌కు హాజరైన స్టాటస్టిక్స్-ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి సౌరభ్ గార్గ్, భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్, నీతి ఆయోగ్ సభ్యులు బాలసుబ్రహ్మణ్యం, ప్రొఫెసర్ కె.వి.రాజు, ప్రధాని ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎస్.మహేంద్ర దేవ్. స్వర్ణ ఆంధ్ర@2047 విజన్ సాధనలో ప్రభుత్వ యంత్రాంగాన్ని అన్ని రకాలుగా సిద్ధం చేసేలా వర్క్ షాప్. ప్రణాళికల రూపకల్పన నుంచి సమర్థవంతమైన అమలు వంటి అంశాలపై ప్రభుత్వ అధికారులకు దిశా నిర్దేశం చేయనున్న సీఎం చంద్రబాబు. వర్క్ షాప్ సందర్భంగా జరుగుతోన్న ప్యానల్ చర్చలో పాల్గొన్న ముఖ్యమంత్రి.

# నా వెంట నడిచిన వారిని ఎప్పటికీ మరిచిపోను : మంత్రి లోకేశ్



**అమరావతి, (రాజధాని వార్తలు):** తన యువగళం పాదయాత్రలో వెంట నడిచిన తెలుగుదేశం కార్యకర్తలను ఎప్పటికీ మరిచిపోనని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. గురువారం తిరుపతిలో జరిగిన కమ్మ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను లోకేశ్ ఆశీర్వదించారు. కార్యక్రమంలో యువగళం బృంద సభ్యులను ఆప్యాయంగా పలకరించిన ఆయన, పాదయాత్ర రోజుల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సుమారు 15 నిమిషాల పాటు కార్యకర్తలతో లోకేశ్ ముచ్చటించారు. యువగళం విజయవంతం కావడంలో టీడీపీ కేడర్ పాత్ర కీలకమని ప్రశంసించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఎదురైన అణచివేతలు, ఇబ్బందులను ధైర్యంగా ఎదుర్కొని పాదయాత్రను విజయవంతం చేసిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. 'కార్యకర్తే అధినేత' అనే లక్ష్యంతో తెలుగు దేశం పార్టీ కేడర్ సాధికారతకు నిరంతరం కృషి చేస్తున్నామని లోకేశ్ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని లోకేశ్ పేర్కొన్నారు. ఏపీలో 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా చర్యలు చేపట్టామని తెలిపారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా జాబ్ క్యాలెండర్ విడుదల, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, కానిస్టేబుల్ నియామకాలు వంటి అంశాల్లో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వివరించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా యువగళం ద్వారా ఏర్పడిన బంధం శాశ్వతమని, కార్యకర్తలతో తన అనుబంధం ఎప్పటికీ కొనసాగుతుందని మరోసారి స్పష్టం చేశారు. మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపగా, యువగళం పాదయాత్రతో ఏర్పడిన అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.


# విరాళాల వివాదంలో కీలక పరిణామం.. చంపత్ రాయ్‌పై పోలీసులకు ఫిర్యాదు



**ఇంటర్‌నెట్ డెస్క్:** అయోధ్య నిధుల దుర్వినియోగం వ్యవహారంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. జూన్ 27వ తేదీన ఆయన తన రాజీనామాను సమర్పించారు. చంపత్ రాయ్‌తో పాటు ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా కూడా రాజీనామా సమర్పించారు. విరాళాల దుర్వినియోగం వివాదంలో నైతిక బాధ్యత వహిస్తూ ఈ ఇద్దరు నేతలు ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే గురువారం కీలక పరిణామం చోటు చేసుకుంది. చంపత్ రాయ్‌పై 'ది బార్ అసోసియేషన్ ఆఫ్ ఫైజాబాద్' లాయర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయోధ్య జిల్లాలోని రామజన్మ భూమి పోలీస్ స్టేషన్‌లో చంపత్ రాయ్‌తో పాటు అనిల్ మిశ్రా, కృష్ణ దేవ్, గోపాల్ రావ్‌లపై కూడా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఫైజాబాద్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కాళికా శరణ్ మిశ్రా మీడియాతో మాట్లాడారు. 'పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాము. ఐదుగురు వ్యక్తులు ఫిర్యాదు హార్డ్ కాపీ తీసుకోవడానికి స్టేషన్‌లోకి వెళ్లారు. పోలీసులు ఫిర్యాదు కాపీ ఇవ్వకపోతే ఆందోళన కొనసాగిస్తాము. రామ్ మందిర్ విషయంలో నిందితులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు భరోసా ఇచ్చారు' అని తెలిపారు. కాగా, విరాళాల లెక్కింపులో అవినీతి జరిగిందంటూ సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ జూన్ 7వ తేదీన సంచలన ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలోనే యూపీ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. జూన్ 25వ తేదీన పలువురిపై ఎఫ్ఐఆర్ నమోదు అయింది. విరాళాల లెక్కింపు ప్రక్రియతో సంబంధం ఉన్న 8 మంది ఉద్యోగులను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. విచారణలో భాగంగా చంపత్ రాయ్ స్టేట్‌మెంట్‌ను దర్యాప్తు అధికారులు రికార్డ్ చేశారు. ఇక, జులై 6వ తేదీన అయోధ్యలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అత్యవసర సమావేశం నిర్వహించనుంది. 2/3 వంతు మెజారిటీతో చంపత్ రాయ్, అనిల్ మిశ్రాల భవితవ్యంపై ట్రస్ట్ నిర్ణయం తీసుకోనుంది. సిట్ సిఫార్సుల మేరకు ట్రస్ట్ మేనేజ్‌మెంట్‌లో భారీ మార్పులు చోటు చేసుకోనున్నాయి.

# "మాట తప్పం...మడమ తిప్పం" అన్న హామీని నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

## - ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ హాజీ షేక్ హసన్ బాషా



**విజయవాడ, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుండి 2026 హజ్ యాత్రకు వెళ్లి క్షేమంగా తిరిగి వచ్చిన 331 మంది హాజీలకు, ఒక్కొక్కరికి రూ. 1,00,000 చొప్పున, మొత్తం రూ. 3,31,00,000 (మూడు కోట్ల ముప్పై ఒక లక్షల రూపాయలు) ను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో హజ్ యాత్రికుల పట్ల ప్రభుత్వం చూపిన చిత్తశుద్ధి, మైనారిటీల సంక్షేమంపై ఉన్న నిబద్ధత మరోసారి స్పష్టమైంది. ఈ సందర్భంగా హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకొని స్వదేశానికి చేరుకున్న హాజీలందరూ, ఈ మహోన్నత నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, మంత్రి నారా లోకేష్‌కి, అలాగే మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి జనాబ్ ఎన్. ఎం.డి.ఫరూక్‌కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, అల్లాహ్ వారి జీవితాల్లో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించి, ప్రజాసేవలో మరింత విజయాన్ని అందించాలని ప్రత్యేక దువాలు చేశారు. అలాగే, హజ్ యాత్రకు సంబంధించిన ఏర్పాట్లు, హాజీలకు కల్పించిన సౌకర్యాలు మరియు ప్రతి హాజీకి రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ షేక్ హసన్ బాషా, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి జనాబ్ ఎన్. ఎం.డి.ఫరూక్‌ని, మైనారిటీ శాఖ కార్యదర్శి చిత్తూరు శ్రీధర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. హజ్ యాత్రికుల సంక్షేమమే లక్ష్యంగా, ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వానికి హాజీల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు.

# మైనారిటీ సంక్షేమం, సాధికారత, న్యాయపాలనలో చారిత్రాత్మక పురోగతి

## - లా, న్యాయ, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి నస్యం మహమ్మద్ ఫరూక్

**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం "స్వర్ణాంధ్రప్రదేశ్-2047" లక్ష్య సాధన దిశగా సంక్షేమం, సామాజిక న్యాయం, మైనారిటీల సాధికారత, పారదర్శక న్యాయపాలనకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని రాష్ట్ర న్యాయ, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి నస్యం మహమ్మద్ ఫరూక్ తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గత రెండేళ్లలో మైనారిటీల సంక్షేమం, విద్య, ఉపాధి, ఆర్థిక సాధికారత, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, హజ్ సేవలు, డిజిటల్ పరిపాలన, న్యాయ సంస్కరణలు, కోర్టుల మౌలిక వసతుల అభివృద్ధి, న్యాయవాదుల సంక్షేమం, ఈ-కోర్టుల విస్తరణ వంటి అన్ని రంగాల్లో ప్రభుత్వం గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. 2026-27లో కూడా మైనారిటీల సాధికారత, సమాన న్యాయం, నాణ్యమైన న్యాయ పాలన, మౌలిక వసతుల అభివృద్ధి, యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాల కల్పనకు మరింత ప్రాధాన్యతనిస్తూ, ప్రతి పౌరుడికి న్యాయం, ప్రతి కుటుంబానికి సంక్షేమం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, 'స్వర్ణాంధ్రప్రదేశ్-2047' విజన్ సాధనలో ఇదే దిశగా ముందుకు సాగుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. మైనారిటీల సంక్షేమానికి రూ.16,147.23 కోట్ల భారీ బడ్జెట్ 2024-25 నుండి 2026-27 వరకు మైనారిటీల సంక్షేమ శాఖకు రూ.16,147.23 కోట్ల బడ్జెట్ కేటాయించగా, గత రెండేళ్లలో రూ.9,759.70 కోట్లు వ్యయం చేయబడిందని మంత్రి తెలిపారు. ఇందులో మైనారిటీల సంక్షేమ కార్యక్రమాల అమలుకు రూ.4,850.91 కోట్లు నేరుగా ఖర్చు చేయడం జరిగిందన్నారు.

**ప్రజా సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది కుటుంబాలకు లబ్ధి**

ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా మైనారిటీ వర్గాలకు విస్తృత స్థాయిలో ప్రయోజనం చేకూరిందన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ద్వారా 3.38 లక్షల మందికి రూ.3,668.74 కోట్లు, తల్లికి వందనం కింద 92,105 కుటుంబాలకు రూ.138 కోట్లు, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్స్ ద్వారా 67,852 మంది విద్యార్థులకు రూ.165 కోట్లు, దీపం-2 పథకం ద్వారా 12.66 లక్షల కుటుంబాలకు రూ.221.36 కోట్లు అందించడం జరిగిందని మంత్రి తెలిపారు. అలాగే ఆటో డ్రైవర్ సేవలో, మెరైన్ ఫిషింగ్ బ్యాన్ రిలీఫ్, ఇమామ్‌లు, మౌజన్లు,



పాస్టర్ల గౌరవ వేతనాలు, PMJVK, హజ్ యాత్ర, రంజాన్, హైటీ, మైనారిటీస్ వెల్ఫేర్ డే కార్యక్రమాలకు నిధులు విడుదల చేయడంతో పాటు, CEDM ద్వారా 10,543 మందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి మైనారిటీల సామాజిక, విద్యా, ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తున్నదన్నారు.

**విద్య ద్వారా సాధికారతకు విశేష ప్రాధాన్యం**

విద్యే మైనారిటీల సాధికారతకు ప్రధాన సాధనంగా భావిస్తున్న ప్రభుత్వం, "తాలిమ్-ఎ-హునర్" పథకం ద్వారా 250 మంది ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు రూ.6 కోట్ల వ్యయంతో కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత రెసిడెన్షియల్ ఇంటర్మీడియట్ విద్యను అందిస్తోందన్నారు. అలాగే TETÅ" 4,300 మంది, డిఎస్సీ-2025కు 1,780 మంది అభ్యర్థులకు ఉచిత కోచింగ్ అందించగా, వారిలో 435 మంది కాల్ లెటర్లు పొందారన్నారు. అదేవిధంగా 350 మంది విద్యార్థులకు నీట్ & ఎంసెట్ కోచింగ్, 7,000 మంది ూాజ ఉర్దూ మీడియం విద్యార్థులకు ఉచిత వర్కుబుక్‌లు అందించడంతో పాటు, CEDM Online Studio మరియు CEDM App ద్వారా ఆధునిక ఆన్‌లైన్ కోచింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు.

**వక్ఫ్ ఆస్తుల రక్షణలో చారిత్రాత్మక చర్యలు**

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, నిర్వహణలో ప్రభుత్వం కీలక విజయాలు సాధించిందన్నారు. 1,500 వక్ఫ్ సంస్థల సర్వేను పూర్తి చేయడంతో పాటు, 88 ఎకరాల వక్ఫ్ భూమిని ఆక్రమణదారుల నుంచి తిరిగి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. తొలిసారిగా 616.65 ఎకరాల వక్ఫ్ భూమికి తహసీల్దార్ల ద్వారా లీజు వేలం నిర్వహించగా, 5,028 వక్ఫ్ సంస్థల వివరాలను సెంట్రల్ పోర్టల్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. అలాగే వక్ఫ్ సంస్థల నిర్మాణాలు, మరమ్మతుల కోసం రూ.5.74 కోట్లు విడుదల చేసి వాటి అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు.

**హజ్ యాత్రికులకు ఆదర్శవంతమైన సేవలు**

హజ్ యాత్రికులకు అత్యుత్తమ సేవలు అందిస్తూ, హజ్-2025లో 1,630 మంది, హజ్-2026లో 1,990 మంది యాత్రికులు విజయవంతంగా యాత్ర పూర్తి చేసేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. విజయవాడ ఎంబార్కేషన్‌ను ప్రోత్సహిస్తూ 2025లో 72 మందికి రూ.72 లక్షలు, 2026లో 331 మందికి రూ.3.31 కోట్లు ఆర్థిక సహాయం అందించడంతో పాటు, లగేజీ ఆలస్యమైన 177 మంది యాత్రికులకు రూ. 24.40 లక్షల నష్టపరిహారాన్ని విమానయాన సంస్థ ద్వారా ఇప్పించి యాత్రికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు.

**PMJVK, PM-VIKAS ద్వారా మౌలిక వసతులు -నైపుణ్యాభివృద్ధి**

PMJVK కింద రూ.231 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టిన ప్రభుత్వం, 2026-27లో రూ.1,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులు అమలు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తోందన్నారు. తొలి విడతలో రూ.101 కోట్లతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు, 5 పాలిటెక్నిక్ కళాశాలలు, అనంతపురంలోని కెజిఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు అదనపు భవనం నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. అదేవిధంగా PM-VIKAS పథకం ద్వారా రూ.10.60 కోట్లు సమీకరించి 1,500 మందికి నైపుణ్య శిక్షణ అందిస్తోందన్నారు.

**ఉర్దూ భాషాభివృద్ధి - డిజిటల్ శిక్షణకు ప్రోత్సాహం**

ఉర్దూ భాషాభివృద్ధికి ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో "ఆవో ఉర్దూ సీఖేన్" సమ్మర్ క్యాంపు, "సురూర్-ఎ-ఉర్దూ" మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించడంతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా 36 కంప్యూటర్ శిక్షణా కేంద్రాల ద్వారా 8,080 మందికి శిక్షణ అందించడం జరిగిందన్నారు. అలాగే శిక్షణా కేంద్రాల ఆధునీకరణ కోసం 216 కంప్యూటర్ల కొనుగోలుకు రూ.2.75 కోట్లు వ్యయం చేస్తూ డిజిటల్ నైపుణ్యాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

**మైనారిటీల సంక్షేమంలో సంస్థాగత బలోపేతం**

వక్ఫ్ బోర్డు, మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఉర్దూ అకాడమీ, హజ్ కమిటీలకు చైర్మన్లు, సభ్యులను నియమించామని తెలిపారు. శ్మశానవాటికలు, ఈద్గా స్థలాల కేటాయింపు, ప్రభుత్వ ఖాజీల నియామకం, పాస్టర్ల మ్యారేజ్ లైసెన్స్ చెల్లుబాటు గడువును 3 సంవత్సరాల నుండి 10 సంవత్సరాలకు పెంచే ఉత్తర్వులు జారీ చేశామని పేర్కొన్నారు.

**న్యాయపాలన బలోపేతానికి సంస్కరణలు**

గత రెండేళ్లలో లా శాఖ వేగవంతమైన, పారదర్శకమైన న్యాయపాలన కోసం విస్తృత సంస్కరణలు అమలు చేయడం జరిగిందన్నారు. రూ.216 కోట్లతో కోర్టుల మౌలిక వసతుల అభివృద్ధికి అనుమతులు, 1,173 మంది మరణించిన న్యాయవాదుల కుటుంబాలకు రూ.46.92 కోట్ల ఆర్థిక సహాయం, న్యాయ మిత్ర పథకంలో స్టైఫండ్‌ను రూ.5,000 నుంచి రూ.10,000కు పెంపు, 19 చట్టాల సమీక్ష ద్వారా 16 చట్టాల్లో వివక్షాత్మక నిబంధనల తొలగింపు, ఆంధ్రప్రదేశ్ జన విశ్వాస్ చట్టం-2026 రూపకల్పన, 10,750 ఫైళ్ల సకాల పరిష్కారం, అలాగే 70 చట్టాలు, 18 ఆర్డినెన్సుల రూపకల్పన, తెలుగు అనువాదం వంటి కీలక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడం జరిగిందన్నారు.

**న్యాయవాదుల సంక్షేమం - కోర్టుల బలోపేతం**

న్యాయవ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ, లా ఆఫీసర్ల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 61 సంవత్సరాలకు, హైకోర్టు న్యాయమూర్తుల గ్రాట్యుటీని రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచామన్నారు. అలాగే 263 మంది ప్రభుత్వ న్యాయాధికారులను నియమించి రూ.31.58 కోట్ల గౌరవ వేతనాలు చెల్లించడంతో పాటు, 86 మంది AGPల వేతనాన్ని 25 శాతం పెంచడం జరిగిందన్నారు. స్పెషల్ జుడీషియల్ మెజిస్ట్రేట్ల గౌరవ వేతనం, భత్యాలు పెంచడంతో పాటు 216 పారా లీగల్ వాలంటీర్ల నియామకానికి రూ.5.91 కోట్లు కేటాయించామన్నారు. అదేవిధంగా ఈ-కోర్ట్స్ ప్రాజెక్ట్, కోర్టు నిర్వహణ, హైకోర్టు బలోపేతం కోసం మొత్తం 305 కొత్త పోస్టులను మంజూరు చేయడం జరిగిందన్నారు.

**2026-27 లక్ష్యాలు**

2026-27 సంవత్సరంలో మైనారిటీల సంక్షేమం, న్యాయపాలన, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వనుందన్నారు. PMJVK కింద రూ.1,000 కోట్ల అభివృద్ధి పనులు, రూ.205 కోట్లతో సుమారు 30,000 మందికి నైపుణ్య శిక్షణ, సబ్సిడీతో స్వయం ఉపాధి,ూవీ-ఎ×ఖూూ ద్వారా 1,500 మందికి శిక్షణ, 96 కొత్త కోర్టుల ఏర్పాటు, 1,770 మంది సిబ్బంది నియామకం, కర్నూలులో హైకోర్టు శాశ్వత బెంచ్ ఏర్పాటు వంటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలతో విద్య, డిజిటల్ నైపుణ్యాలు, న్యాయపాలన, మౌలిక వసతులు మరియు మైనారిటీల సాధికారతను మరింత వేగవంతం చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో లా సెక్రటరీ జి.ప్రతిభాదేవి, మైనారిటీ సెక్రటరీ బి.శ్రీధర్ పాల్గొన్నారు.

# శ్రీ సిటీ ఇంటర్నేషనల్ వర్సిటీలో చదువుకుంటూనే సంపాదన

## - లోకేష్ చేతుల మీదుగా వర్క్-స్టడీ మోడల్ వర్సిటీకి శ్రీకారం






**శ్రీసిటీ (తిరుపతి), (రాజధాని వార్తలు):** విద్యార్థులు చదువుకుంటూనే నైపుణ్యాలను సాధిస్తూ సంపాదించే వర్క్ స్టడీ మోడల్ విశ్వవిద్యాలయం శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐయు గ్లోబల్ అడ్వైజరీ కౌన్సిల్, గవర్నింగ్ బోర్డు, పరిశ్రమ భాగస్వాములు పాల్గొన్నారు. ఎస్ఐయు వర్క్ - స్టడీ (పని చేస్తూ-చదువు) డ్యుయల్ మోడల్ విధానంలో ఏర్పాటైంది. ఈ మోడల్ ద్వారా ప్రతి విద్యార్థి స్టడీ సమయంలో నేర్చుకున్న విద్యతో పాటు వాస్తవ ఉద్యోగ అనుభవం పొంది మార్కెట్‌కు సిద్ధమవుతాడు. భారత్‌లో ప్రతిఏటా సంవత్సరానికి 90 లక్షలకి పైగా గ్రాడ్యుయేట్స్ వివిధ యూనివర్సిటీల నుంచి బయటకు వస్తున్నారు. అందులో సుమారు 42.6% మంది మాత్రమే సంబంధిత నైపుణ్యాల్లో అర్హులని ఒక అధ్యయనంలో తేలింది. చాలా మంది తమ అర్హత కన్నా తక్కువ స్థాయిలో ఉద్యోగాలు పొందుతున్నారు. చాలామంది ఉద్యోగార్థుల్లో నైపుణ్య లోటు స్పష్టంగా కన్పిస్తోంది.

**నాన్ ప్రాఫిటబుల్ విద్యాసంస్థ ఎస్ఐయు**

ఎస్ఐయు ఒక దాతృత్వ ఉద్దేశంతో స్థాపించబడింది. టెక్నాలజిస్టులు, పారిశ్రామిక నిపుణులు, దాతలు కలిసి ఈ యూనివర్సిటీని ఏర్పాటుచేశారు. ఇది Sricity Education Foundation ద్వారా AP State Private Universities Act కింద ఏర్పాటు చేయబడి, Section 8 కంపెనీగా నాన్ ప్రాఫిటబుల్ విద్యాసంస్థగా పనిచేస్తోంది.

**వర్క్-స్టడీ మోడల్ ఎలా పని చేస్తుంది?**

ఈ విధానంలో విద్యార్థులు తమ స్టడీలో మూడో వంతు సమయం మాత్రమే క్యాంపస్‌లో చదువుతారు. మిగిలిన సమయంలో పరిశ్రమల వద్ద ఇంటర్న్‌షిప్‌గా పనిచేస్తారు. మొదటి సంవత్సరం నుండే విద్యార్థులకు కనీసం నెలకు రూ.10,000 స్టైపెండ్ అందుతుంది. పనిలో నిపుణత పెరిగే కొద్దీ పరిశ్రమలు స్టైపెండ్ పెంచతాయి. నాలుగు సంవత్సరాల డిగ్రీ పూర్తి చేసే సమయానికి వాస్తవ పని అనుభవం (సుమారు 2+ సంవత్సరాలు) వస్తుంది.

**పాఠ్యాంశాల ప్రణాళిక**

కోర్సులు పరిశ్రమలతో కలిసి రూపకల్పన చేయబడతాయి. ప్రతి ఏడాది ఏఐ, పరిశ్రమ మార్పులకు అనుగుణంగా పాఠ్యక్రమాన్ని నవీనీకరిస్తారు. విద్యార్థుల భవిష్యత్తు పనికి అవసరమైన నైపుణ్యాలు, సామర్థ్యాలు నేర్చుకుంటారు.

**ఎంటర్ ప్రెన్యూర్ షిప్**

క్యాంపస్‌లో Station-S అనే ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. Station-S, Gnan Circle Ventures సహాయంతో సుమారు 10 స్టార్టప్స్ ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించాయి. ఇక్కడ పరిశ్రమ అనుకూల విద్యతో పాటు జీవన నైపుణ్యాలు, సృజనాత్మక మేధస్సు పెంపొందిస్తారు. శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ప్రోగ్రామ్‌లు- ప్రవేశాలు, 2026-27కి అందిస్తున్న కోర్సులు.

1). B.Tech - Computer Science & Engineering (School of Technology & AI)

2). B.Tech - Advanced Manufacturing (School of Advanced Manufacturing)

3). BBA - Finance & Accounts (School of Business)

4). BBA - Digital Media & Communications (School of Nova Media)

ప్రవేశాలు ఇప్పటికే ప్రారంభయ్యాయి. ఆన్‌లైన్ దరఖాస్తు: www.thesiu.org ప్రవేశాల సమాచారం: +91 8977763331 / +91 8977763332, ఈ-మెయిల్: admissions@thesiu.org

# ఏపీ సర్కార్ కీలక నిర్ణయం..
# ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు పెంపు



**అమరావతి, (రాజధాని వార్తలు):** పీఎస్‌యూలు, కార్పొరేషన్లు, సొసైటీల ఉద్యోగులకు సంబంధించిన పదవీ విరమణ వయసుపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న 60 ఏళ్ల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. గతంలో రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించిన తీర్మానానికి అనుగుణంగా సర్కార్ గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈ నిర్ణయం 2022 జనవరి 1 నుంచి రిట్రోస్పెక్టివ్‌గా అమలు కానుంది. అలాగే, 60 ఏళ్ల వయసులో పదవీ విరమణ పొందిన అర్హులైన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకునే అవకాశం ఉంది. మళ్లీ జాబ్‌లో చేరే వరకు ఉన్న గ్యాప్ పీరియడ్‌కు జీతం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. గ్యాప్ పీరియడ్‌ను సీనియారిటీ, ప్రమోషన్ల కోసం పరిగణనలోకి తీసుకోరని పేర్కొంది. కోర్టు ఆదేశాల మేరకు 62 ఏళ్ల వరకు పనిచేసిన ఉద్యోగులకు పూర్తి స్థాయి సర్వీస్ బెనిఫిట్స్ అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 60 ఏళ్లకు పదవీ విరమణ పొంది తిరిగి విధుల్లో చేరేందుకు ఆసక్తి లేని ఉద్యోగులకు పాత నిబంధనల ప్రకారమే రిటైర్మెంట్ వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయాన్ని అమలు చేసేందుకు సర్వీస్ రూల్స్‌లో అవసరమైన సవరణలు చేయాలని సంస్థలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే ప్రతి సంస్థ తమ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించింది. అన్ని శాఖలు తమ పరిధిలోని పీఎస్ యూలు, కార్పొరేషన్లు, సొసైటీలకు వెంటనే ఉత్తర్వులను పంపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

# ఎవరైనా పచ్చగా ఉంటే చూడలేని మనస్తత్వం జగన్‌ది : మంత్రి కొల్లు

**కృష్ణా జిల్లా, (రాజధాని వార్తలు):** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి కొల్లు రవీంద్ర ఫైర్ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎలా ముందుకు తీసుకెళ్లాలా అని చూస్తుంటే, జగన్ మాత్రం అభివృద్ధిని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆగ్రహించారు. రాష్ట్రాభివృద్ధి కోసం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చంద్రబాబు ముందుకెళుతుంటే, జగన్ కుట్రపూరితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సైకో ఆలోచనలు కలిగిన వ్యక్తి ఏ విధంగా ఉంటాడనే దానికి నిన్న (బుధవారం) జగన్ మాట్లాడిన మాటలే నిదర్శనమన్నారు. జగన్ కాసేపు అమరావతే రాజధాని అని అంటారని.. మరికాసేపు 'లేదు, మా స్టాండ్ మావిగన్' అని మాట్లాడతారని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఫ్యాన్ పార్టీ అధినేత ఆలోచనా విధానాలు ఏ విధంగా ఉన్నాయో అందరూ గమనించాలని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ముందేమో వారిది అమరావతి స్టాండ్ అని చెప్పారన్నారు. ఎన్నికల ముందు, గెలిచిన తర్వాత మూడు రాజధానుల పేరిట ఆటలాడారని మండిపడ్డారు. మూడు రాజధానులని చెప్పి ఎన్నికల్లోకి వెళ్లగా, ప్రజలు 11 సీట్లకే ఆయనను పరిమితం చేశారని అన్నారు. ఈ రోజు మళ్లీ వచ్చి 'మావిగన్' అని మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎవరైనా పచ్చగా ఉంటే చూడలేని మనస్తత్వం ఉన్నవాడినే సైకో అంటారని పేర్కొన్నారు. ఏం మాట్లాడుతారో, ఏం చేస్తారో తెలియని పరిస్థితి జగన్‌దని ఎద్దేవా చేశారు. జగన్ మొన్న తన మనుషులను పంపించి రాజధానిలో సీఆర్‌డీఏ పరిరక్షణ కమిటీ పేరుతో కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. దీంతో అక్కడి రైతులు, ప్రజలు వారిని తరిమి తరిమి కొట్టారని ఎద్దేవా చేశారు. ఇంకా ఈ దొంగ డ్రామాలు, నాటకాలు ఆడుతూ ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టాలా? అని జగన్‌ని కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. మనుషులు, కులాలు, మతాల మధ్య వైషమ్యాలు సృష్టించాలని కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజలందరూ పరిస్థితిని దయచేసి గమనించాలని మంత్రి కొల్లు విజ్ఞప్తి చేశారు. జగన్ గతంలో మూడు రాజధానులని చెబుతూ ఎన్నికలకు వెళ్లగా.. 11 సీట్లకే పరిమితం అయ్యారని అన్నారు. 'మావిగన్'తో రేపు సున్నా సీట్లకే ఆయనను ప్రజలు పరిమితం చేస్తారని వ్యాఖ్యానించారు.

# మున్సిపల్ కార్మికునికి పరామర్శ



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మున్సిపాలిటీలో స్ట్రీట్ లైట్ వర్కర్‌గా పనిచేస్తున్న కాపవరపు నూకరాజును తెదేపా పట్టణ అధ్యక్షులు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బదుగు శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ కనకారావు తదితరులు పరామర్శించారు. సాయి నగర్‌లో వీధిలైట్లు మరమ్మతులు నిర్వహిస్తుండగా విద్యుత్ స్తంభం పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి నూకరాజు గాయపడగా అతడు చికిత్స పొందుతున్నాడు.

కాగా అతనిని బుధవారం నాయ కులు శ్రీకాంత్, కమిషనర్ కనకారావు తదితరులు పరామర్శించి అతని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కాగా నూకరాజు త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకొని తిరిగి విధుల్లో చేరాలని వారు ఆకాంక్షించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రజల సేవలో విధులు నిర్వహించే కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్‌కు శ్రీకాంత్ సూచించారు.

# హత్య కేసులో నలుగురుకి యావజ్జీవ కారాగార శిక్ష




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ స్వీయ పర్యవేక్షణలో మర్డర్ కేసుల ట్రయల్స్‌ను వేగవంతం చేస్తూ కాకి నాడ జిల్లా పోలీసులు మరో కీలక కేసులో విజయ వంతమైన తీర్పు సాధించారు. ఈ మేరకు ఈ తీర్పుకు సంభం దించి పెద్దాపురం డిఎస్పీ ఎబిజి తిలక్ బుధవారం వివరాలు వెల్లడించారు. 2016లో పెద్దాపురం మండలం చినబ్రహ్మదేవం గ్రామంలో జరిగిన ఘటనలో మృతుడు బాత్రెడ్డి స్వామి అనే బురిబాబు తన మేనకోడలు తాళిశెట్టి దేవి “పసుపు-కుంకుమ”గా పొందిన రెండు ఎకరాల భూమిని విక్రయించిన విషయమై ప్రశ్నించడంతో వారి మధ్య వివాదం నెలకొంది. అనంతరం మృతుడు దేవిపై దాడి చేయడంతో గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ జరగగా, తన తప్పును అంగీకరించాడు. అయితే అప్పటి నుంచి దేవి కుటుంబ సభ్యులు మృతుడిపై కక్ష పెంచుకు న్నారు. ఈ క్రమంలో 2016 మే 30న రాత్రి సుమారు 8 గంటల సమయంలో ఏ1 ముద్దాయి ఆచంట శివ, ఏ2 ముద్దాయి ఆచంట గోపాలస్వామి అనే గబ్బర్ సింగ్, ఏ3 ముద్దాయి ఆచంట వెంకన్న, ఏ4 ముద్దాయి ఆచంట గోపాలస్వామి అనే తాతయ్య కాపులు కర్రలతో మృతుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అనంతరం అతడిని పెద్దాపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా, వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి అన్నయ్య బాత్రెడ్డి గోవింద్ ఫిర్యాదు మేరకు పెద్దాపురం పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఎస్ఐ వై సతీష్ కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి సీఐ కె శ్రీధర్ కుమార్ దర్యాప్తు చేపట్టి నలు గురు నిందితులను 2016 జూన్ 8న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఆ కేసు ట్రయల్ రన్ జరగగా ఇటీవల జరిగిన ట్రయల్‌లో ప్రభుత్వ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జె వినయ తేజ బలమైన వాదనలు వినిపించగా, 7వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎన్ సరస్వతి ఈ కేసులో నలుగురు నిందితులకు బుధవారం యావజ్జీవ కఠిన కారాగార శిక్ష తో పాటు ఒక్కొక్కరికి రూ. 5వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువ రించినట్టు డి ఎస్పీ తిలక్ తెలిపారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ కేసు దర్యాప్తును సమర్ధవం తంగా నిర్వహించిన అప్పటి దర్యాప్తు అధికారి శ్రీధర్ కుమార్, అప్పటి పెద్దాపురం ఎస్‌డీ పీఓ డి శ్రీహరిరాజు, ప్రస్తుత ఎస్‌డీపీఓ ఎబిజి తిలక్, సీఐ వైఆర్కె శ్రీనివాస్, ఎస్ఐ వి మౌనిక, కోర్టు లైజన్ ఆఫీసర్ డిఎన్ఎస్డి సాయి వెంకటేశ్వరరావులతో పాటు ప్రభుత్వ తరఫున సమర్ధవంతంగా వాదనలు వినిపించిన ఎం ధనుజయ రావు, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జె వినయ తేజను ప్రత్యేకంగా అభినందించారు.

# వృద్ధులకు పింఛన్ ఆర్థిక భరోసా : ఎమ్మెల్యే



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పేదలకు ఎన్టీఆర్ పింఛన్ పథకం ఆర్థిక భరోసాను ఇస్తుందని పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. బుధవారం పేదల సేవలో కార్యక్ర మంలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే చిన రాజప్ప పాల్గొని లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంద న్నారు. అనంతరం పెద్దాపురం నూతనంగా నిర్మిస్తున్న ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్మాణపు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్, రాష్ట్ర నాయ కులు రాజా సూరిబాబు రాజు, బడుగు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ బోడుప్పల్‌లో భూ పోరాటం.. కవిత అరెస్ట్



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షు రాలు కవితను బోడుప్పల్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. గురు వారం ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని బోడుప్పల్‌లో భూ పోరాటానికి టీఆర్ఎస్ సిద్ధమైంది. ఇందులో భాగంగా బోడుప్పల్ చేరుకుని భూ పోరాటం చేస్తున్న కవితను పోలీసులు అడ్డుకు న్నారు. దీంతో పోలీసులతో టీఆర్ఎస్ కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. తోపులాట చోటు చేసుకోవడంతో కవితతో పాటు టీఆర్ ఎస్ శ్రేణులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

**కాంగ్రెస్ సర్కార్‌కు కౌంట్‌డౌన్ స్టార్ట్: కవిత**

ఉప్పల్‌లో ఈరోజు తెలంగాణ ఉద్యమకారులు, మహిళల రక్తం చిందిందని కవిత అన్నారు. బొల్లారం పీఎస్ వద్ద టీఆర్ఎస్ చీఫ్ మాట్లాడుతూ.. మహిళలు, తెలంగాణ ఉద్యమకారులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీఛార్జ్ చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను మాత్రమే అడిగాం తప్ప వేరే డిమాండ్లు ఏమీ అడగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నేటి నుంచి కౌంట్‌డౌన్ స్టార్ట్ అయ్యిందన్నారు. ఉద్యమకారులకు వాళ్లు ఇస్తామన్న 250 గజాల స్థలం ఇవ్వాలని మాత్రమే అడిగామని తెలిపారు. కచ్చితంగా ఉద్యమకారులకు ఇస్తామన్న హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అడిగితే ఉద్యమకారులపై లాఠీఛార్జ్ చేసి రక్తం చిందేలా కొట్టడం అన్యాయమన్నారు. ఉద్యమకారులకు ఇస్తామన్న హామీలను ఈ ప్రభుత్వానికి రోజూ గుర్తు చేస్తూనే ఉంటామని కవిత స్పష్టం చేశారు.

# డయాలసిస్ పేషెంటుకు రూ. వేలు పించన్ పంపిణీ



**అల్లవరం, (రాజధాని వార్తలు):** రెండు కిడ్నీలు పాడై డయాలసిస్ వైద్యంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్న బాధితునికి రూ. 10 వేల రూపాయలు పించన్‌ను బుధవారం పంపిణీ చేసారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత బోడసకుర్రు గ్రామ పంచాయతి పరిధిలో కిడ్నీ బాధితుడు కూడుపూడి మహేష్‌కు పించన్ అందించటం ఆనందంగా ఉందని కూటమి నాయకులు అన్నారు. కిడ్నీ బాధితునికి పింఛన్ ద్వారా అందిస్తున్న రూ. 10 వేల మందులకు, ఇతర ఖర్చులకు ఆర్థికంగా ఎంతో భరోసాగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ నారాయణమూర్తి, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు అరవ చంటీ,బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు అడప శ్రీను, జనసేన గ్రామాక అధ్యక్షులు రోళ్ళ శ్రీను, రొక్కాల నాగేశ్వరరావు, దొమ్మేటి రాధా కృష్ణ, ఓలేటి పరమేశ్వరరావు, మొయిల గణపతి, కొడమంచిలి రామకృష్ణ, దొమ్మేటి రాజు, మట్టపర్తి శ్రీను, జల్లి రాధాకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ చిట్టిబాబు, జల్లి నాగేంద్ర స్వామి తది తరులు పాల్గొన్నారు.

# హైవేపై మద్యం బాటిళ్లు

**- తీవ్ర అసౌకర్యానికి గురైన వాహనదారులు - హైవేపై ఉన్న మద్యం సీసాలను, పగిలిన పెంకులను తొలగించాలని కోరుతున్న ప్రజలు**





**అమలాపురం, (రాజధాని వార్తలు):** నేషనల్ హైవేపై కాళీ మద్యం సీసాలు పెద్ద ఎత్తున పడి ఉండటం స్థానికంగా కలకలం రేపాయి. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు- శివకోడు నేషనల్ హైవేపై బుధవారం మద్యం సీసాలు పడి ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నేషనల్ హైవేపై ఖాళీ బ్రాందీ, బీరు సీసాలు పెద్ద ఎత్తున రోడ్డుపై పడిపోవడంతో వాహనాలు వాటిపై నుంచి వెళ్లడంతో సీసాలు పగిలి రహదారి అంతా గాజు పెంకులతో నిండిపోవటంతో ద్విచక్ర వాహనదా రులు, ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మద్యం సీసాల లోడ్ తీసుకెళ్తున్న ఓ లారీ నుండి సీసాలు జారి రోడ్డుపై పడ్డాయని ఆ లారీ డ్రైవర్ వాహనం ఆపి దిగి పరిశీ లించి వాటిని తొలగించకుండా అక్కడి నుంచి వెళ్లిపోయాడని స్థానికులు తెలిపారు. భారీ వాహనాలు రహదారిపై ఉన్న మద్యం బాటిల్ పై నుండి వెళ్లడంతో సీసాలు పగిలి గాజు పెంకులు రహదారి మొత్తం చల్లాచెదురుగా పడటంతో వాహన దారులు, ప్రయాణి కులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మద్యం బాటి ళ్లు, పగిలిన గాజు పెంకులతో ప్రమాదకరంగా మారిన రహదారిని వెంటనే శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఘటనపై అధికారులు విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# ఉపాధ్యాయురాలు చికోలు అరుణకు పదవీ విరమణ



**కరప, (రాజధాని వార్తలు):** విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా మూడు దశాబ్దాలకు పైగా నిబద్ధత, క్రమశిక్షణ, సేవా భావంతో ఉపాధ్యాయ వృత్తిలో విశిష్ట సేవలు అందించిన సాం ఘిక శాస్త్ర అధ్యాపకురాలు చికోలు అరుణ బుధవారం పదవీ విరమణ చేశారు. కాకినాడ రూరల్ కర్మ మండలం స్థానిక శ్రీ నక్క సూర్యనారాయణమూర్తి పీఎం శ్రీ ఉన్నత పాఠశాల ప్లస్‌లో ఆమెకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రస్తుతం అదే పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహి స్తున్న చికోలు అరుణ దాదాపు 37 సంవత్సరాలపాటు ప్రభుత్వ విద్యాశాఖలో విశేష సేవలు అందించారు. ఉపాధ్యాయ వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా సామాజిక బాధ్యతగా భావించి, విద్యార్థులకు పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యేలా బోధిస్తూ ఆదర్శ ఉపాధ్యాయురాలిగా గుర్తింపు పొందారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయ పాలన, దేశభక్తి, సామాజిక బాధ్యత వంటి విలువ లను పెంపొందించేందుకు ఆమె నిరంతరం కృషి చేశారు. సహచర ఉపాధ్యాయులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందించారు. విద్యా, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని విద్యా ర్థులను ప్రోత్సహించడంలో ముందుండేవారు. ఆమె బోధనలో తీర్చిదిద్దుకున్న అనేక మంది విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో కొనసాగుతూ ఆమెకు మంచి పేరు తీసుకొచ్చా రని పలువురు పేర్కొన్నారు. నిజాయితీ, అంకితభావం, సేవా దృక్పథానికి ప్రతీకగా నిలిచిన చికోలు అరుణ అందించిన సేవల ను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో భాగస్వామ్యమవుతూ విద్యార్థుల కు మార్గదర్శకత్వం అందించాలని, ఆరోగ్యంగా, ఆనందంగా దీర్ఘాయుష్షుతో జీవించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు, పూర్వ విద్యార్థులు, అభిమానులు ఆకాంక్షిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

# భారతీయ సంస్కృతి పరిరక్షణే అభ్యాస వర్గాల లక్ష్యం



**కరప, (రాజధాని వార్తలు):** భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యా ప్తంగా అన్ని స్థాయిల్లో కన్వీనర్లకు అభ్యాస వర్గాలు నిర్వహిస్తు న్నట్లు సంస్థ ప్రాంత ప్రముఖ కొండారెడ్డి తెలిపారు. కరప మండల పర్యటనలో భాగంగా ఆయన నడకుదురు, పెనుగుదురు గ్రామాల్లో గృహ సంపర్క సమావేశాలు నిర్వహించారు. ఈ సం దర్భంగా గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న నడకుదురు శివాలయం మాజీ చైర్మన్, సమరసత సేవా ఫౌండే షన్ మాజీ మండల కన్వీనర్ ముమ్మిడి పెద్దకాపును పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కొండా రెడ్డి మాట్లాడుతూ గ్రామ కన్వీనర్ల నుంచి మండల, ఖండ, జిల్లా, ప్రాంత స్థాయిల వరకు దశలవారీగా అభ్యాస వర్గాలు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. గోదావరి విభాగానికి చెందిన కాకినాడ, కోనసీమ, తూర్పు గోదా వరి, పశ్చిమ గోదావరి, పోలవరం జిల్లాల మండల కన్వీనర్లకు జూలై 7, 8 తేదీల్లో రాజమహేంద్రవరంలో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. జూలై 18, 19 తేదీల్లో ఖండ, జిల్లా స్థాయి కన్వీనర్లకు విజయవాడలో అభ్యాస వర్గాలు జరుగు తాయని వివరించారు. ఈ అభ్యాస వర్గాలను విజయవంతం చేయడానికి ధర్మ ప్రచారకులు సమన్వయంతో కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోదావరి జోన్ ధర్మ ప్రచారక్ తోట జగన్నాథం, జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు, ఖండ కన్వీనర్ ముమ్మిడి శ్యామ్ సుందర్ రావు, మండల కన్వీనర్ కాద సత్యనారాయణ, పెనుగుదురు గ్రామ కన్వీనర్ యాళ్ల హరినాథ్, నడకుదురు ఎస్సీ అర్చక స్వామి కాలకూరి వెంకట రమణ, ఖండ ధర్మ ప్రచారక్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## మనను మైమరిపించే మధుర మామిడి

కరుణామయుడు అయిన భగవంతుడు కనికరం లేని వేసవి కాలాన్ని ఎందుకు సృష్టించాడు? ఇదొక చిక్కు ప్రశ్న. నాకు తెలిసిన ఒకే ఒక్క సమాధానం : మామిడి పండు. ఈ పండ్లను మధురమూ, రసప్లావితమూ చేసేందుకు భగవంతుడు ఈ లోకం పైకి వేడిని వర్షించాడు. ప్రస్తుత రాజకీయ సందిగ్ధావస్థకు సమాధానం కూడా మామిడి పండ్లే సుమా! బంగాళాఖాతం నుంచి అరేబియా సముద్రం దాకా దేశవ్యాప్తంగా ప్రబలంగా వీస్తున్న రాజకీయ చండమారుతాల ఉధృతిని తట్టుకునేందుకు ఏమి చేయాలి? మధుర మామిడి పండ్లు ఆస్వాదించడమే కాదూ? మీకు వీలైతే ఆ ఫలరాజాల గురించి కూడా చదవండి. గత వారాంతంలో నేను అదే చేశాను. నా స్నేహితుడు ఫాహీమ్ ఖాన్ తోట నుంచి నేరుగా పంపిన మధురాతి మధురమైన మామిడి పండ్లను ఆబగా ఆస్వాదించాను. నా మరో స్నేహితుడు సోపాన్ జోషి అద్భుత రచన 'మాంగిఫెరా ఇండికా: ఎ బయోగ్రఫీ ఆఫ్ మ్యాంగో' విశేష ఆసక్తితో చదివాను. 'ఇంగ్లీష్ వారికి వాతావరణం ఎలాగో భారతీయులకు మామిడి పండ్లు అలాంటివి' అని జోషి నొక్కి చెప్పారు. ఆయన ఇంకా ఇలా రాశారు: 'ఆ మధుర ఫలం గురించి మనం ఎంత ఎక్కువగా మాట్లాడితే అది అంత ఎక్కువగా మనకు దర్పణం అవుతుంది. జనులు మామిడి పండు గురించి మాట్లాడినప్పుడు అంతిమంగా తమ వ్యక్తిగత మూలాలను, అభిరుచులను, ప్రాంతీయ వారసత్వాన్ని వెల్లడిస్తారు. మన మామిడి పండ్లు మనలను నిర్వచిస్తాయి'. సరే మామిడి పండ్ల విషయంలో నా పక్షపాతాల గురించి కూడా మనసు విప్పుతాను. నేను పుట్టిన హర్యానా ప్రాంతమూ, నేను పెరిగిన రాజస్థాన్ ప్రాంతమూ మామిడి పండ్లకు ప్రసిద్ధమైనవి కావు. కనుక మామిళ్లలో ఉత్తమమైనవి ఏవి అనే విషయమై చర్చలో నన్ను నేను తటస్థ తీర్పరిగా భావించుకుంటున్నాను. అల్ఫోన్సో మామిడి పండు రుచిలో పరిపూర్ణమైనది కానప్పటికీ అధికధర పొందుతున్నదని నేను విశ్వసిస్తున్నాను. ఆ ప్రకారం చూస్తే, అఖిల భారత అల్ఫోన్సో వ్యతిరేక సంఘానికి నేను జీవితకాల అధ్యక్షుడిని. రెండో సభ్యుడు చేరిక కోసం ఇంకా నిరీక్షిస్తున్నాను. సఫైదా మామిడి పండు వీధి చివర ఉండే పండ్లరసాల దుకాణాలలో వినియోగం కోసం పుట్టిందని నా అభిప్రాయం. దశేరీ మామిడి పండు లతామంగేష్కర్ మధురగానంలా సుమధురమైనది. ఆ గానమూ, ఈ రసాలమూ మనకు సంపూర్ణ సంతృప్తినిస్తాయి. లంగ్డా రుచి గీతాదత్ గానం వలే శ్రేష్ఠమైనది, ఉల్లాసాన్నిచ్చేది, సందేహం లేదు. చౌసాకు సాటివచ్చే మామిడి పండు మరేదీ లేదు. చౌసా మాధుర్యాన్ని వర్ణించేందుకు ఎటువంటి ఉపమ అవసరం లేదు. ఆ పేరే దివ్యమైనది. నా స్నేహితుడు పంపిన మధుర ఫలాలను ఆస్వాదిస్తూ ఆయా మామిడి పండ్ల గురించి పునరాలోచించడం ప్రారంభించాను. ఇంతకు ముందు గులాబ్ జామ్‌ను నేను ఎందుకు రుచి చూడలేదని నాలో నేను ఆశ్చర్య పోయాను. మామిళ్ల గురించిన ఈ చర్చని హఠాత్తుగా మిఠాయిల వైపు మార్చుతున్నానని మీరు పొరపడకండి. నేను మామిళ్లలో రకాల గురించే మాట్లాడుతున్నాను. ఏటా మూడు నెలల పాటు మే 18 నుంచి ఆగస్టు 15 దాకా నా ఆలోచనలన్నీ వాటిచుట్టూనే తిరుగుతూంటాయి. నిర్దిష్ట తేదీలను ఎందుకు చెప్పానని మీరు తెలుసుకోవాలనుకుంటున్నారా? మా మొదటి బిడ్డ తల్లి గర్భంలో ఉన్నప్పుడు డాక్టర్ సూచన మేరకు జెస్టేషనల్ డయాబెటిస్ కారణంగా మామిడి పండ్లను తినడం నిలిపివేశాము. కఠినమైన ఆహార నియమమది. ప్రసవం తరువాత ఆ ఆహార నియమాల నుంచి విముక్తి లభించింది. ఆ ఆనందాన్ని మామిడి పండ్ల విందుతో వేడుక చేసుకున్నాం ఆ వేడుక ఆచారం క్రమంగా ఏటా జరిగే సంప్రదాయంగా పరిణమించింది. సరే, మళ్లీ గులాబ్ జామున్ విషయానికి వస్తాను. అది ఒక చిన్న, ఆకుపచ్చని వర్ణంలో ఉండే మామిడి పండు. లంగ్డా అని పొరపడేందుకు అవకాశమూ ఉన్నది. రుచి, రూపంలో దానికంటే మిన్న అయినది, సందేహం లేదు. దానిపై మీరు చాకును ఉపయోగించనవసరం లేదు. తోలు తీసేసి నోట్లో పెట్టుకుని జుర్రుకోవచ్చు. ఐదు శతాబ్దాల క్రితం మొగల్ సామ్రాజ్య స్థాపకుడు బాబర్ తన ఆత్మకథలో గులాబ్ జామున్ ఆస్వాదించడం గురించి అలానే రాశాడు. ఢిల్లీకి సమీపంలోనే గులాబ్ జామున్ మామిళ్లను ఇచ్చే మామిడి తోటలు ఉన్నాయి.. షాజహాన్ చక్రవర్తికి విశ్వసనీయుడు అయిన అధికారి ఒకరు మీరట్‌కు సమీపంలో స్థిరపడిన షాజహాన్ పూర్ మొదలైన 16 గ్రామాల్లో ఈ మామిడి పండ్లు లభిస్తాయి. ఢిల్లీకి సమీపంలో ఉన్నప్పటికీ అవి ఢిల్లీలోని మామిడి పండ్ల విపణిలో లభించవు. గులాబ్ జామున్ రైతులు కుటుంబ వినియోగం కోసమే వాటిని పెంచుతారని ఫాహీమ్ ఖాన్ చెప్పాడు. రటౌల్ అనే మరో మధుర మామిడి కూడా ఢిల్లీ సమీప గ్రామాల్లో పెరుగుతుంది. అయితే ఢిల్లీ దుకాణాలలో అది లభ్యంకాదు. బిహార్ నుంచి, ఆ మాటకొస్తే మామిడి పండ్లను కాపుకాయించే మరే రాష్ట్రం నుంచి వచ్చిన స్నేహితుడినైనా అడగండి, బైజు అనే మామిడి పండు గురించి తమ బాల్య స్మృతులను ఏకరవుపెడతారు. ఇప్పుడు ఆ ఫలం తమకు ఎక్కడా లభ్యం కావడం లేదని కూడా చెప్పుతారు. మా కుటుంబానికి సంబంధించి కూడా ఒక ఆసక్తికరమైన విషయాన్ని తెలియచేస్తాను. మా అమ్మగారు తన బాల్యాన్ని అలహాబాద్‌లో మామిడి పళ్ల మధ్యనే గడిపారు. వివాహానంతరం మా నాన్నతో కలిసి ఆమె మళ్లీ అలహాబాద్‌కు వెళ్లినప్పుడు బంధువులు తరిగిన మామిడిపళ్ళ ముక్కలను ఒక ప్లేట్‌లో పెట్టి ఇచ్చారట. మా అమ్మకు ఒక్కసారిగా ఆనందం, ఆశ్చర్యం కలిగాయి. కానీ, ఆ ముక్కలను ఎలా తినాలో ఆమెకు తెలియలేదు. దీన్నిబట్టి మామిడి పండ్లతో మన సంబంధంలో ఎటువంటి మార్పులు సంభవించాయో విశదమవుతుంది.

# డాక్టర్ కందుల నిర్విరామ సేవా కార్యక్రమాలు

**- పలు శుభకార్యాలకు సహాయం - పుష్పవతి అయిన అమ్మాయిలకు వెండి పట్టీలు, పట్టుబట్టలు వితరణ - 32వ వార్డులో కే.ఎన్.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కొనసాగుతున్న సేవలు**





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** నిస్వార్థ సేవ ద్వారానే సమాజంలో నిజమైన మార్పు వస్తుందని, అందరూ తమ వంతు బాధ్యతగా సేవా కార్యక్రమాలు చేపట్టడం వల్ల మానవత్వం పరిమళిస్తుందని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మావారి దేవస్థానం చైర్మన్, కే.ఎన్.ఆర్.చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జనసేన నాయకులు డాక్టర్ కందుల నాగరాజు అన్నారు. 32వ వార్డు అల్లిపురం నేరేళ్ల కోనేరులో గల తన కార్యాలయంలో పుష్పవతి అయిన 34వ వార్డు భూపేస్ నగర్‌కు చెందిన ఎర్రా సుగుణ, కొబ్బరి తోటకు చెందిన ఏ.ద్రాక్షయనిలకు జాతీయ జర్నలిస్టుల కార్యదర్శి గంట్ల శ్రీనుబాబుతో కలిసి వెండి పట్టీలు, పట్టు బట్టలు, పసుపు కుంకుమ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ నిస్వార్థ సేవ సమాజ పురోగతికి మూల స్తంభమని అన్నారు. ప్రతి ఒక్కరూ మానవత్వంతో ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలను చేపట్టడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. సహాయం అవసరమైన వారికి ఆసరా గ తాను అండగా ఉంటున్నట్లు చెప్పారు. పేదలు, వృద్ధులు, అనాథలకు అవసరమైన వసతి, ఆహారం, వైద్య సాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. చదువుకు దూరమైన పిల్లలకు విద్యను అందించడం, సమాజంలో అవసరమైన విషయాలపై అవగాహన కల్పించడం. మొక్కలు నాటడం, నీటిని సంరక్షించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేయడం, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్విరామంగా చేపడుతున్నట్లు చెప్పారు. నిస్వార్థ సేవ సమాజంలో మానవత్వాన్ని పెంపొందించి, అందరిలోనూ సోదరభావాన్ని పెంపొందిస్తుందని, మనం చేసే చిన్న సహాయం కూడా ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కందుల కృష్ణ, వి.శ్రీనివాస్, కాండ్రేగుల అప్పారావు, హేమ, జానకి, నూకాలమ్మ, ఈశ్వరరావు, ధనలక్ష్మి, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

# అభాగ్యుడికి అండగా నిలిచిన మానవత్వం



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** జ్ఞానాపురానికి చెందిన మాజీ ఆటో డ్రైవర్ జోసెఫ్ విలియం ఆర్లాండ్ అనారోగ్యం, క్లిష్ట పరిస్థితుల కారణంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న 41వ వార్డు క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు ఐతి రవి బాబు మరియు అవర్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా ప్రతినిధి పిల్లి గోవింద రాజు స్పందించి, ఈరోజు ఆయనను "మదర్ తెరెసా అనాథ ఆశ్రమంలో చేర్పించారు.

ఈ కార్యక్రమములో మొబైల్ కానిస్టేబుల్ రాంబాబు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న ఒక వ్యక్తికి ఆశ్రయం కల్పించడం ద్వారా మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారని స్థానికులు అభినందించారు.

# జర్నలిస్ట్ సూర్యప్రకాష్ సేవలు చిరస్మరణీయం

## - నివాళులర్పించిన పాత్రికేయులు

**విశాఖ / పెందుర్తి, (రాజధాని వార్తలు):** సుదీర్ఘకాలం పాత్రికేయుడిగా సేవలందించి ఇటీవలే మృతి చెందిన సూర్య ప్రకాష్ సేవలు చిరస్మరణీయమని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు కొనియాడారు. అనారోగ్యం బారిన పడిన సూర్య ప్రకాష్ ఇటీవలే అకాల మరణం చెందారు. దీంతో బుధవారం పెందుర్తి సాధు మఠం సమీపంలో ఉన్న నివాసంలో వారి కుటుంబ సభ్యులు సూర్య ప్రకాష్ దశదినకర్మ నిర్వహిం చారు. ఈ సందర్భంగా సూర్య ప్రకాష్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ చిన్న పత్రిక నుంచి పాత్రికేయుడుగా కెరియర్ ప్రారంభించిన సూర్య ప్రకాష్ తర్వాత కాలంలో టీవీ 9 టీవీ 5 వంటి సంస్థల్లో పని చేశారన్నారు. అలాగే మెట్రో టీవీలో కూడా తన సేవలు అందించినట్లు గంట్ల శ్రీనుబాబు చెప్పారు. సింహాచలం దేవస్థానంతో పాటు సమీప ప్రాంతాల్లో వార్తా కథనాలు సేకరించి



ఎప్పటికప్పుడు ఆయా కార్యాలయాలకు అందించేవారన్నారు. ప్రజలతోపాటు ఇతర మీడియా మిత్రులు అధికారులు సన్నిహితులు అభిమానులతో కూడా సరదాగా కలిసిమెలిసి తిరిగే వారన్నారన్నారు. ఆయన మరణం పాత్రికేయులకు తీరని లోటుగా అభివర్ణించారు. అనంతరం సూర్యప్రకాష్ కుటుంబ సభ్యులను గంట్ల శ్రీనుబాబుతో పాటు సీనియర్ పాత్రికేయులు వి.ఎస్.ఆనంద్, డేవిడ్, కొమ్ము బుచ్చిబాబు, గంటా ప్రసాద్ తదితరులు అంతా పరామర్శించి ధైర్యం చెప్పారు.

# మదనపల్లెలో ఘనంగా డాక్టర్స్ డే

## - హాజరైన శ్రీకాళహస్తి పీఎంపీ అసోసియేషన్ సభ్యులు

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** ఏపీ స్టేట్ ఫెడరేషన్, జేఏసీ మదనపల్లె, తిరుపతి శ్రీకాళహస్తి చిత్తూరు పీఎంపీ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్స్ డేను బుధవారం జరుపుకున్నారు. ఇదేవిధంగా శ్రీకాళహస్తి డివిజన్ ప్రెసిడెంట్ మావిళ్ళపల్లి వెంకటేష్, సెక్రటరీ సురేష్ రెడ్డి, ట్రెజరర్ వీరయ్య యాదవ్, గౌరవా ధ్యక్షులు బాలాజీ ముఖ్య సలహాదారు జిల్లా పిఎంపి డాక్టర్స్ వింగ్ శివశంకర్ సభ్యులు గౌరవప్రదంగా మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ భాషాని పుష్పగుచ్ఛంతో సత్కరించి ఘనంగా సన్మానం చేశారు. ఈ మీటింగ్‌లో రాష్ట్ర జేఏసీ జాయింట్ సెక్రటరీగా మావిళ్ళపల్లి వెంకటేష్ నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బి.రాంబాబుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ఫెడరేషన్ ఏపీఆర్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ అయినటువంటి కె.జి.డాక్టర్ గోవింద



రెడ్డి ద్వారా రాష్ట్ర నియామక పత్రాలని అందజేశారు. ఎఫ్ ఎఫ్ ఎం పి ఏ ఏపీ రాష్ట్ర ఫెడరేషన్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పొట్టి ప్రతాప్ రావు, ఎఫ్ ఎఫ్ ఎం పి ఏ ఏపీ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి సి.ఎస్.కుమార్‌లు శాలువాలతో సత్కరించారు.

# దొరబాబుకు ఘన సన్మానం



**అల్లవరం, (రాజధాని వార్తలు):** గుంటూరు జిల్లా బిజెపి ఇన్చార్జిగా యాళ్ళ దొరబాబును ఎంపిక చేయడం పట్ల పలువురు నేతలు ఆయనను ఘనంగా సన్మానించారు. అల్లవరం మండలం కొమరగిరి పట్నంలో మెట్లరామ్మూర్తి సొసైటీ మాజీ అధ్యక్షులు గునిశెట్టి రోహిణి కుమార్ స్వగృహంలో బుధవారం దొరబాబును నేతలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రోహిణి కుమార్ మాట్లాడుతూ గుంటూరు జిల్లాల్లో బిజెపి ఇన్చార్జిగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్డీఏ కూటమి నాయకులు దొరబాబుకు అభినందనలు తెలిపి సాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుర్రం శీను, సొసైటీ సీఈవో కొమ్మూరి సత్తిబాబు, వ్యవసాయ శాఖ ఆత్మ డైరెక్టర్ గుర్రం శారది, సొసైటీ డైరెక్టర్ కడలి శ్రీను, బల్ల సత్యనారాయణ, గుర్రం బాబ్జి, తెలుగు యువత నాయకులు పరసా కిరణ్, మురమళ్ళ భగవాన్, అడ్డగల్లా శీను, గుర్రం దొరబాబు, మెట్ల బాబి, గూడూరి పెదబాబు, కొత్తల శీను, సంగీతం తాతాజీ, పప్పుల ప్రసాద్, ఆకుల రాము తదితరులు పాల్గొన్నారు.

# బడి బస్సులపై ప్రత్యేక తనిఖీలు

**- ప్రైవేట్ విద్యా సంస్థలకు చెందిన ఒక బస్సు సీజ్ - రెండు బస్సులకు రూ.17 వేలు అపరాధ రుసుము విధించిన డిటిఓ**



**అమలాపురం, (రాజధాని వార్తలు):** జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులపై రవాణా శాఖ అధికారులు విస్తృ తంగా తనిఖీలు నిర్వహించినట్టు జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలో 48 బడి బస్సులపై రవాణాశాఖ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ప్రత్యేక తని ఖీల్లో ఫిట్ నెస్ లేకుండా తిరుగుతున్న డాక్టర్ ఆర్.బి. ఆర్.వి.ఆర్.ఎన్ మహిళా డిగ్రీ కళాశాల బస్సుపై కేసు నమోదు చేసి సీజ్ చేశామని డిటిఓ శ్రీనివాస రావు తెలిపారు. ఇన్సూరెన్స్ లేకుండా తిరుగుతున్న ఇతర విద్యాసంస్థ లకు చెందిన రెండు బస్సులపై కేసులు నమోదు చేసి రూ. 17,500/ అపరాధ రుసుము విధించామన్నారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని నిబంధనలు ఉల్లంఘిస్తే మోటార్ వాహన చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని డీ.టీ.ఓ శ్రీనివాస్‌రావు హెచ్చరించారు.

# ఏరియా ఆసుపత్రిలో న్యాయ విజ్ఞాన సదస్సు




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం ఏరియా ఆసుపత్రిలో జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా మండలం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు బుధవారం నిర్వహించారు. ఆసుపత్రి సూపరిండెంట్ రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో మండల న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాదులు మడికి రాంబాబు ఎస్ విశాలాక్షి గణేష్ పాల్గొని పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆసుపత్రిలో ఇన్ పేషెంట్ వార్డ్‌లో రోగులకు అందు తున్న వైద్య సదుపాయాలు, ఇతర అంశాలపై రోగులతో మాట్లాడి వారికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఉచిత న్యాయ సహాయం పొందగోరు వారు మండల న్యాయ సేవాధికార సంస్థ సిబ్బందిని సంప్రదించాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డా.ఏ శ్రీనివాస్ డా.రాజు, డా.హర్షిత రాజా ఐసిటిసి కౌన్సిలర్ శ్రీనివాస్, హెడ్నర్స్ రమాదేవి, ఆరోగ్య మిత్రలు శేఖర్, జగపతి రాజు, పారా లీగల్ వాలంటీర్లు మాసా చంద్రరావు (చందు), కేవీపీ లక్ష్మి, డి లక్ష్మి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభాస్ ఫ్యాన్స్ ఎదురు చూపులకు తెర పడేది ఎప్పుడో?



ఈ ఏడాది ఆరంభంలో 'రాజాసాబ్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ప్రభాస్, మరో సినిమాను ఇదే ఏడాదిలో రిలీజ్ చేసే విధంగా ప్లాన్ చేస్తాడని అంతా భావించారు. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఫౌజీ సినిమా ఖచ్చితంగా 2026లోనే విడుదల ఉంటుందని మొన్నటి వరకు అంతా అనుకున్నారు. కానీ ప్రస్తుత పరిస్థితులను చూస్తూ ఉంటే ఫౌజీ సినిమా ఆలస్యం అయ్యే అవకాశం కనిపిస్తుంది. ఇప్పటి వరకు ఫౌజీ షూటింగ్ చకచక జరుగుతూ వచ్చింది. ఎప్పుడైతే సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో స్పిరిట్ సినిమా మొదలైందో అప్పటి నుంచి ఫౌజీ ఆలస్యం అవుతుందని ఇండస్ట్రీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. అందుకు కారణం స్పిరిట్ సినిమా షూటింగ్ ప్రారంభించినప్పటి నుంచి కంటిన్యూగా డేట్లు ఇవ్వాలని ప్రభాస్‌కి ముందుగానే సందీప్ రెడ్డి వంగ రిక్వెస్ట్ పెట్టుకున్నాడు. అందుకు ప్రభాస్ ఓకే అన్నాడట.

**ప్రభాస్ స్పిరిట్ మూవీ షూటింగ్...**

ప్రభాస్ ఇచ్చిన మాట ప్రకారం స్పిరిట్ సినిమాకు బల్క్ డేట్లు ఇస్తూ వస్తున్నాడు. సందీప్ కోరిన సమయంలో ప్రభాస్ అందుబాటులో ఉంటున్నాడట. అంతే కాకుండా బాడీ డబుల్ లేకుండా పూర్తిగా ప్రభాస్ స్పిరిట్ సినిమా కోసం వర్క్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. దాంతో ప్రభాస్ కాస్త ఎక్కువ సమయం కేటాయించడంతో పాటు, ఎక్కువ కష్టపడుతున్నట్లు యూనిట్ సభ్యుల ద్వారా తెలుస్తోంది. స్పిరిట్ సినిమాను కేవలం ఆరు నెలల వర్కింగ్ డేస్‌తోనే పూర్తి చేసే విధంగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగ ప్లాన్ చేసుకున్నాడు. అందుకు తగ్గట్టుగా ప్రభాస్ నుంచి సహకారం అందుతుంది. దాంతో వచ్చే ఏడాదిలో అనుకున్న సమయంకు స్పిరిట్ సినిమా విడుదల ఉంటుందని సమాచారం అందుతోంది. అయితే ఫౌజీ సినిమా విషయంలో మాత్రం ఆలస్యం తప్పదని తెలుస్తోంది. స్పిరిట్ కోసం ఫౌజీ కాస్త ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది.

**హను రాఘవపూడి ఫౌజీ మూవీ...**

హను రాఘవపూడి దర్శకత్వంలో సినిమా అంటే కూల్ అండ్ కామ్‌గా సాగుతుంది. ప్రభాస్ చాలా కాలం తర్వాత ఒక కంప్లీట్ ఫీల్ గుడ్ మూవీని చేస్తున్నాడని అభిమానులు చాలా ఉత్సాహంగా ఫౌజీ సినిమా కోసం వెయిట్ చేస్తున్నారు. సినిమా ఇదే ఏడాదిలో ఉంటుందని ఫ్యాన్స్ ఆశగా ఎదురు చూశారు.

కానీ సినిమా షూటింగ్ జాప్యం కారణంగా ఈ ఏడాదిలో ఫ్యాన్స్‌కి పండగ లేనట్లే అనిపిస్తుంది. హను రాఘవ పూడి మూవీ అంటే మినిమం ఉంటుందని అన్ని వర్గాల వారు నమ్మకంగా ఉన్నారు. ఎప్పుడు వచ్చినా ఫౌజీ మినిమం గ్యారెంటీ హిట్ కొడుతుందని ఫ్యాన్స్ ధీమాతో ఉన్నారు. ముఖ్యంగా హను రాఘవపూడి గత చిత్రం సీతారామం సినిమా ఏ స్థాయి విజయాన్ని సొంతం చేసుకుందో తెలిసిందే. అందుకే ప్రభాస్‌తో ఆ రేంజ్ సినిమా తీస్తే ఇండియన్ బాక్సాఫీస్ షేక్ కావడం ఖాయం అని బాక్సాఫీస్ వర్గాల వారు సైతం అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**రాజాసాబ్ సినిమా తర్వాత ప్రభాస్...**

గత ఏడాది విడుదల కావాల్సిన రాజాసాబ్ సినిమా ఈ ఏడాది సంక్రాంతి కానుకగా వచ్చింది. సినిమా ఫలితం తీవ్రంగా నిరాశ పరిచింది. దర్శకుడు మారుతి ఇలా చేశాడేంటి అంటూ తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. ఆ సమయంలోనే రాబోయే మూవీ ఫౌజీ కనుక ఈ డ్యామేజీ అంతా కంట్రోల్ చేస్తుందని ఫ్యాన్స్ భావించారు. సాధారణంగా ఏ హీరో అయినా ఒక మూవీ నిరాశ పరిస్తే వెంటనే మరో సినిమాను వదలాలి అనుకుంటారు.. కానీ ప్రభాస్ అలా కాకుండా స్లో అండ్ స్టడీ అన్నట్లుగా ముందుకు సాగుతున్నాడు. ఏడాదిలో కచ్చితంగా రెండు సినిమాలు చేస్తాను, విడుదల చేస్తాను అని గతంలో ప్రభాస్ ఇచ్చిన హామీ ఈసారి కూడా నిలబెట్టుకునే పరిస్థితి లేనట్లే. ఫౌజీ, స్పిరిట్ సినిమాలు వచ్చేది ఎప్పుడో...? ప్రభాస్ ఫ్యాన్స్ ఎదురు చూపులకు తెర పడేది ఎప్పుడో కాలమే నిర్ణయించాలి. ఈ రెండు సినిమాలు మాత్రమే కాకుండా ప్రభాస్ సలార్, కల్కి 2 సినిమాలు సైతం ఫ్యాన్స్‌ను ఊరిస్తున్నాయి. వాటి కోసం ఎదురు చూపులు ఎన్నాళ్ళు కొనసాగాలో చూడాలి.


# సూర్య నెక్ట్స్.. సంబంధం లేకున్నా జాగ్రత్త పడాల్సిందేనా..



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య లీడ్ రోల్‌లో వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమాపై ప్రస్తుతం మంచి అంచనాలు ఉన్నాయి. ఫస్ట్ లుక్, టీజర్‌కు సూపర్ రెస్పాన్స్ వచ్చింది. ఫ్యామిలీ ఎమోషన్స్ తో పాటు కొత్త తరహా స్టోరీ ఉండబోతుందనే ప్రచారం కూడా సినిమాకు ప్లస్ గా మారింది. ఆగస్టు 14న విడుదలకు సిద్ధమవుతున్న ఆ చిత్రం ప్రమోషన్లలో బిజీగా ఉంది. అయితే ఇప్పుడు సినిమాకు సంబంధం లేని మరో అంశం సోషల్ మీడియాలో చర్చకు వస్తోంది. జూనియర్ ఎన్టీఆర్– త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో తెరకెక్కనున్న భారీ మైథాలజికల్ మూవీకి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో విడుదల చేసిన ప్రమోషనల్ క్యాప్షన్ పై తమిళనాడులో కొంతమంది నెటిజన్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఉత్తరాన పుట్టారనే వర్డ్స్‌పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ వివాదానికి విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమాకు ఎలాంటి సంబంధం లేదు. కానీ రెండు చిత్రాల నిర్మాత నాగవంశీయే కావడం వల్ల ఇప్పుడు ఆ చర్చ సూర్య సినిమా వరకు చేరుతోంది. తమిళ ప్రేక్షకుల్లో కొందరు ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ పోస్టులు చేస్తున్నారు. ప్రస్తుతం ఇది పెద్ద వివాదంగా మారకపోయినా, విడుదల సమయం దగ్గరపడుతున్న వేళ ఇలాంటి చర్చలు కొనసాగడం మాత్రం మేకర్స్‌కు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. సూర్యకు తమిళనాడులో ఉన్న ఫ్యాన్ బేస్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అక్కడ ఆయనకు ఉన్న ఇమేజ్, మార్కెట్ చాలా స్ట్రాంగ్‌గా ఉన్నాయి. అలాంటి హీరో సినిమా విడుదలకు ముందు అనవసరమైన చర్చలు జరగడం ప్రమోషన్ల పరంగా మంచిది కాదు. ముఖ్యంగా పాన్ ఇండియా సినిమాల విషయంలో ప్రతి ఏరియాలోని ప్రేక్షకుల అభిప్రాయం కీలకంగా మారుతున్న సమయంలో సోషల్ మీడియాలో వచ్చే ప్రతి అంశాన్ని మేకర్స్ జాగ్రత్తగా పరిశీలించాల్సిన పరిస్థితి ఉంది. ఇటీవల సోషల్ మీడియాలో మొదలైన చిన్నచిన్న వివాదాలు కూడా కొన్ని సినిమాల ప్రమోషన్స్‌పై ఎఫెక్ట్ చూపించిన సందర్భాలు ఉన్నాయి. కొన్నిసార్లు విడుదలకు ముందే మేకర్స్ వివరణ ఇవ్వడం, అపోహలు తొలగించడం ద్వారా ప్రాబ్లంను క్లియర్ చేసిన ఉదాహరణలు ఉన్నాయి. అందుకే ఇప్పుడు చర్చ ఎక్కువ కాలం కొనసాగకుండా చూడాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వినిపిస్తోంది.


నిర్మాత నాగవంశీ నుంచి ఆ అంశంపై ఏదైనా క్లారిటీ వస్తుందా? లేక ఎన్టీఆర్– త్రివిక్రమ్ సినిమా తదుపరి అప్డేట్‌తో ఆ వివాదానికి తెరపడుతుందా? అన్నది చూడాలి. ఎందుకంటే వివాదం ఒక సినిమాకు సంబంధించినదే అయినా, అదే బ్యానర్ నుంచి మరో భారీ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉన్నప్పుడు దాని ఎఫెక్ట్ ఎంతవరకు ఉంటుందన్నది నిర్మాతలు పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశమే. ప్రస్తుతం విశ్వనాథ్ అండ్ సన్స్ బజ్ పూర్తిగా కంటెంట్ చుట్టూనే తిరుగుతోంది. అదే ఎన్విరాన్మెంట్ చివరి వరకు కొనసాగితే సినిమాకు మరింత ప్లస్ అయ్యే అవకాశం ఉంది. అందుకే సంబంధం లేకపోయినా చర్చలు పెద్దవి కాకముందే జాగ్రత్త పడటం మేకర్స్‌కు మరింత ప్రయోజనకరంగా మారుతుందనే అభిప్రాయం వినిపిస్తోంది.

# అతిలోక సుందరి గర్వించేలా జాన్వీ కోలీవుడ్ డెబ్యూ?



అతిలోక సుందరి, దివంగత శ్రీదేవి తనయగా బాలీవుడ్‌లో అడుగుపెట్టిన జాన్వీ కపూర్ ఇప్పుడు దక్షిణాది చిత్ర పరిశ్రమపై గట్టిగానే దృష్టి సారించింది. ఇప్పటికే తన తల్లికి ఎంతో ఇష్టమైన టాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఈ బ్యూటీ, ఇక్కడ వరుసగా రెండు పెద్ద సినిమాలతో భారీ విజయాలను దక్కించుకుంది. ఎన్టీఆర్ సరసన దేవర ఘనవిజయం సాధించగా, రామ్ చరణ్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది బాక్సాఫీస్ వద్ద విజయం అందుకుంది. తెలుగులో సాధించిన సక్సెస్ జోష్‌తో ఇప్పుడు తమిళ పరిశ్రమ (కోలీవుడ్) పై కన్నేసినట్లు తెలుస్తోంది. తమిళంలో ఈ యంగ్ బ్యూటీ ఎంట్రీ ఇవ్వబోతోందనే వార్తలు ఇండస్ట్రీ వర్గాల్లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం కోలీవుడ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్న కథనాల ప్రకారం.. ప్రముఖ దర్శకుడు పా రంజిత్‌కు చెందిన నీలం ప్రొడక్షన్స్ బ్యానర్‌పై.. దర్శకుడు సర్గుణం తెరకెక్కించనున్న కురత్తి అనే వెబ్ సిరీస్ ద్వారా జాన్వీ కపూర్ తమిళంలోకి అడుగుపెట్టబోతోందని ప్రచారం సాగుతోంది. ఇందులో జాన్వీ ప్రధాన పాత్రలో నటిస్తుందని కథనాలొస్తున్నాయి. అయితే దీనిపై మేకర్స్ నుండి కానీ.. జాన్వీ నుండి కానీ ఎలాంటి అధికారిక ధృవీకరణ రాలేదు. ఒక వెబ్ సిరీస్‌తో జాన్వీ కోలీవుడ్ డెబ్యూ ఉండబోతోందనే వార్త ప్రస్తుతం అభిమానుల్లో ఆసక్తిని కలిగించడమే కాదు.. కొంత ఆందోళనను రేకెత్తిస్తోంది. ఒకసారి గతంలోకి వెళ్తే.. జాన్వీ తల్లి, లెజెండరీ నటి శ్రీదేవి కోలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆరంగేట్రాన్ని అందుకున్నారు. 1967లో వచ్చిన కందన్ కరుణై అనే భక్తిరస చిత్రంలో కేవలం నాలుగేళ్ల వయసులోనే చైల్డ్ ఆర్టిస్ట్‌గా వెండితెరకు పరిచయమైన శ్రీదేవి.. ఆ తర్వాత 1976లో లెజెండరీ డైరెక్టర్ కె.బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన రొమాంటిక్ థ్రిల్లర్ మూండ్రూ ముడిచ్చు చిత్రంతో 13 ఏళ్ల వయసులోనే హీరోయిన్‌గా అరంగేట్రం చేశారు. అంతటి గొప్ప దర్శకుడితో కెరీర్ ప్రారంభించే అవకాశం శ్రీదేవికి దక్కింది.. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో జాన్వీ కపూర్‌కు అలాంటి ఒక లెజెండరీ డైరెక్టర్‌తో డెబ్యూ ఛాన్స్ సాధ్యపడేలా కనిపించడం లేదు. శ్రీదేవికి ఉన్న గొప్ప ఇమేజ్ దృష్ట్యా.. జాన్వీ కపూర్ తమిళంలో కూడా ఒక పెద్ద కమర్షియల్ సినిమాతోనే గ్రాండ్‌గా ఎంట్రీ ఇవ్వాలని తమిళ ప్రేక్షకులు, అభిమానులు బలంగా కోరుకుంటున్నారు. తెలుగు పరిశ్రమలో ఎన్టీఆర్, రామ్‌చరణ్ వంటి అగ్ర హీరోల సరసన పెద్ద ప్రాజెక్టులతో అడుగుపెట్టినట్లే.. కోలీవుడ్‌లో కూడా ఒక క్రేజీ స్టార్ హీరో సినిమాతోనే ఆరంగేట్రం చేయాలని ఆశిస్తున్నారు. అయితే వెబ్ సిరీస్ వార్తలపై గానీ..కోలీవుడ్ ఎంట్రీపై గానీ అటు జాన్వీ కపూర్ కానీ, తన తండ్రి బోనీ కపూర్ కానీ ఇప్పటివరకు ఎలాంటి అప్‌డేట్ ఇవ్వకపోవడంతో సస్పెన్స్ కొనసాగుతోంది. శ్రీదేవి తమిళ చిత్రసీమలో ఒక శకానికి తెరతీసిన సూపర్ స్టార్. చెన్నైలోనే స్థిరపడి, మద్రాసు పరిశ్రమ నుండి తెలుగు చిత్రసీమలోకి ప్రవేశించి ఇక్కడా నెంబర్ వన్‌గా ఏలారు. ఆ తర్వాత బాలీవుడ్‌ను సైతం సుదీర్ఘ కాలం పాటు శాసించిన మేటి నాయికగా చరిత్ర సృష్టించారు. తల్లికి తమిళనాట ఉన్న ఆ సెంటిమెంట్.. క్రేజ్ దృష్ట్యా జాన్వీ కపూర్‌కు ఈ తమిళ ఆరంగేట్రం ఎంతో కలిసి రావాల్సి ఉంది. అందుకే వెబ్ సిరీస్‌లతో కాకుండా.. బాక్సాఫీస్‌ను షేక్ చేసే ఒక బ్లాక్ బస్టర్ సినిమాతోనే జాన్వీ కోలీవుడ్ డెబ్యూ జరగాలని.. తన తల్లి గర్వపడేలా ఆ అడుగు ఉండాలని అతిలోక సుందరి అభిమానులు మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నారు.

# ఎలిగెన్స్ ఓవర్‌లోడ్... నిహారిక గ్లామరస్ అవతారం ట్రెండింగ్!



మెగా డాటర్ నిహారిక కొణిదెల తన క్యూట్‌నెస్, స్టైలిష్ లుక్స్‌తో ఎప్పుడూ సోషల్ మీడియాలో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తుంటారు. ట్రెడిషనల్ శారీస్ అయినా మోడ్రన్ వెస్ట్రన్ డ్రెస్సులు అయినా..తనదైన స్టైల్‌తో అభిమానులను కట్టిపడేయడం ఆమె ప్రత్యేకత. తాజాగా నిహారిక చేసిన ఒక అద్భుతమైన ఫోటోషూట్ ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. మంచు ముక్కలాంటి డ్రెస్‌లో దేవకన్యలా మెరిసిపోతున్న ఆమె లేటెస్ట్ విజువల్స్ చూసి మెగా ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఆ వివరాలు చూద్దాం..

**లైట్ బ్లూ రఫుల్ గౌన్‌లో నిహారిక మెరుపులు:**

ఈ లేటెస్ట్ ఫోటోషూట్‌లో నిహారిక కొణిదెల స్కై బ్లూ కలర్ హాల్టర్, నెక్ రఫుల్ టల్లే గౌన్ వేసుకుని చాలా రాయల్‌గా కనిపించింది. ఈ గౌన్ పైభాగంలో సిల్వర్ ఎంబ్రాయిడరీ, సీక్విన్ ఫ్లోరల్ డిజైన్లు చాలా అందంగా మెరుస్తున్నాయి. ఇక కింద మల్టీ లేయర్డ్ రఫుల్స్ ఉండడంతో ఈ డ్రెస్ నిహారికకు ఒక పర్ఫెక్ట్ ప్రిన్సెస్ లుక్‌ను ఇచ్చింది.

**స్నోఫ్లేక్ అంటూ క్రేజీ క్యాప్షన్:**

ఈ బ్యూటిఫుల్ ఫోటోలను నిహారిక తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ.. "ఎంబోడీయింగ్ ఎ స్నోఫ్లేక్, ఆర్ సంథింగ్ లైక్ దట్.." అంటూ ఒక క్రేజీ క్యాప్షన్ ఇచ్చింది. తన పర్సనల్ లైఫ్‌లో ఎదురైన ఒడిదొడుకుల తర్వాత, నిహారిక తన కెరీర్‌పై మరింత ఫోకస్ పెట్టి చాలా కాన్ఫిడెంట్‌గా, స్టైలిష్‌గా మారిపోయింది. ఇక ఆమె ముఖంలోని చిరునవ్వే ఆమెకు అసలైన అందం అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

**ప్రొడ్యూసర్‌గా 'రాకాస'తో సూపర్ హిట్:**

కేవలం నటిగానే కాకుండా నిహారిక ఒక సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్‌గా టాలీవుడ్‌లో రాణిస్తున్నారు. తన సొంత బ్యానర్ 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్'పై ఆమె వరుసగా ప్రాజెక్టులు నిర్మిస్తున్నారు. గత ఏడాది ఆమె ప్రొడ్యూస్ చేసిన యూత్‌ఫుల్ సూపర్‌నేచురల్ ఫాంటసీ కామెడీ థ్రిల్లర్ మూవీ 'రాకాస' బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ సాధించి, నిర్మాతగా ఆమెకు మంచి పేరు తెచ్చిపెట్టింది. అన్నయ్య వరుణ్ తేజ్‌తో భారీ సినిమా: ప్రస్తుతం నిహారిక ప్రొడక్షన్‌లో మరికొన్ని క్రేజీ సినిమాలు లైన్‌లో ఉన్నాయి. అందులో అన్నింటికంటే ముఖ్యమైనది.. తన అన్నయ్య, మెగా హీరో వరుణ్ తేజ్‌తో చేస్తున్న సినిమా. ఇక వరుణ్ తేజ్ హీరోగా ఆమె 'భారీ' అనే అప్‌కమింగ్ మూవీని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో ప్రొడ్యూసర్‌గా తన రేంజ్‌ను మరింత పెంచుకోవాలని నిహారిక ప్లాన్ చేస్తున్నారు. ఒకవైపు గ్లామరస్ ఫోటోషూట్లతో సోషల్ మీడియాలో ట్రెండ్ సెట్ చేస్తూ, మరోవైపు బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో నిర్మాతగా బిజీగా గడుపుతున్నారు నిహారిక. ఇక స్టైల్, గ్లామర్ అండ్ బిజినెస్ మైండ్‌ను పర్ఫెక్ట్‌గా బ్యాలెన్స్ చేస్తున్న ఈ మెగా డాటర్ రాబోయే రోజుల్లో 'భారీ' సినిమాతో ఎలాంటి సక్సెస్ అందుకుంటుందో చూడాలి.

# వైద్య సేవకు చిరస్మరణీయ చిరునామా డాక్టర్ బి.సి.రాయ్



**విజయనగరం, (రాజధాని వార్తలు):** వైద్యుడు ప్రాణదాత అని, వైద్యో నారాయణో హరి ప్రజలు భావిస్తారని అటువంటి వైద్య వృత్తికి వన్నె తెచ్చి వైద్య సేవకు చిరస్మరణీయ చిరునామాగా డాక్టర్ బి.సి.రాయ్ నిలిచారని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు డాక్టర్ జెసి నాయుడు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ వైద్య దినోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దేవుడు అన్నిచోట్లా ఉండలేక వైద్యులను సృష్టించారని పేర్కొ న్నారు. సంఘం జిల్లా శాఖ గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ జి సన్యాసమ్మ, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు గిరిజా ప్రసన్న, సంధ్య భారతి జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య వృత్తి గురించి అవగాహన కల్పించడమే కాక పాఠశాల స్థాయి నుంచి క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ పి ఎస్ వి రామారావు, ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ జాడ శ్రీకాంత్, ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ బొబ్బిలి కృష్ణ చైతన్య, ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ బాల భార్గవి, ప్రముఖ హోమియో వైద్యులు డాక్టర్ గాడి ప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. గీతాంజలి పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోండా రమేష్, బాలు, వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ సుభద్ర దేవి, మహిళా విభాగం నాయకులు దివ్య, శ్రావ్య, పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసరావు, వివిధ స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నవంబర్‌లోగా టిడ్కో గృహాలు సిద్ధం చేయాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో మంజూరైన టిడ్కో గృహ నిర్మాణాలన్నింటినీ నవంబర్ మాసంలోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తన ఛాంబర్‌లో టిడ్కో గృహ నిర్మాణ ప్రగతిపై టిడ్కో అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టిడ్కో గృహ నిర్మాణంలో మౌలిక సదుపాయాల పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణ పరిధిలో ఉన్న సోనియా నగర్, సారిపల్లిలో జరుగుతున్న గృహ నిర్మాణ పురోగతిపై సమీక్ష చేశారు. బొబ్బిలి, నెల్లిమర్ల, రాజాంలో జరుగుతున్న పనులపై సమీక్షిస్తూ బొబ్బిలి టిడ్కో గృహ సముదాయానికి ప్రధాన రహదారి కోసం కనీసం ఇరవై అడుగుల రహదారి సిద్ధం చేయాలని బొబ్బిలి మున్సిపల్ కమీషనర్‌ను ఆదేశించారు. సోనియా నగర్, సారిపల్లిలో పూర్తి అయిన 3776 ఇళ్లకు టిడ్కో గృహాలకు కనీస మౌలికవసతులు ఆగస్ట్ లో సిద్ధం చేయాలన్నారు. మున్సిపల్ పరిధిలో ఉన్న టిడ్కో గృహాలకు త్రాగునీరు అందించేందుకు త్వరితగతిన పైపులైన్లు ఏర్పాటుచేయాలని అదేవిధంగా డ్రైనేజీ వ్యవస్థ కూడా సిద్ధం చేసి ప్రజలకు ఆవాసయోగ్యంగా ఉండాలని టిడ్కో అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో టిడ్కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీరామమూర్తి, విజయనగరం ఇంచార్జ్ మున్సిపల్ కమీషనర్ ప్రసాదరావు, నెల్లిమర్ల మున్సిపల్ కమీషనర్ కిలాన అప్పలరాజు, బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి పాల్గొన్నారు.

# ఆధ్యాత్మికత శోభాయమానంగా ఉంది

## - విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాల్లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**మెంటాడ, (గజపతినగరం), (రాజధాని వార్తలు):** విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలలో ఆధ్యాత్మికత శోభాయమానంగా ఉందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మెంటాడ మండలం కైలాం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరామ మందిర ప్రతిష్ట పూజా కార్యక్రమాలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, నిర్వాహకులు మేళ తాళములతో, వేద మంత్రములతో మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీరామ మందిరం ప్రతిష్ట సందర్భంగా గ్రామం అంతా కూడా ఆధ్యాత్మిక వెల్లివేరుస్తుందని, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తూ ఉండటం చూస్తే ఎంతో శోభాయమానంగా ఉందన్నారు. ఆలయ నిర్మాణం ఎంతో ఆకట్టుకునే విధంగా నిర్మించారని, యువతీ యువకులు కూడా పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం మంచి శుభ పరిణామం అన్నారు. ఆలయ నిర్వాహకులు మంత్రికి శ్రీ సీతారామచంద్ర స్వామివారి విగ్రహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఆలయ నిర్వహకులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో పూజలు చేయటం తెలుగువారి సాంప్రదాయం

## - పాచలవలస గ్రామంలో నూతన రామాలయం ప్రతిష్ఠా కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్





**దత్తిరాజేరు, (గజపతినగరం), (రాజధాని వార్తలు):** భక్తి శ్రద్ధలతో పూజలు చేయటం తెలుగువారి సాంప్రదాయమని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని పాచలవలస గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయం ప్రతిష్ఠా కార్యక్రమాల్లో బుధవారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఇందులో భాగంగా యాగశాలలో నిర్వహించిన ప్రత్యేక పూజలలో మంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆలయ నిర్మాణ పూజా కార్యక్రమాలలో భక్తిశ్రద్ధలతో పాల్గొనటం చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. దంపతులు పీటలపై కూర్చుని ఎంతో వైభవోపేతంగా, శాస్త్రబద్ధంగా జరుగుతున్న కార్యక్రమాల్లో పాల్గొనటం గ్రామస్తుల భక్తి ప్రవత్తులను తెలియజేస్తుందన్నారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక భావనలతో ముందుకు సాగాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పివివి గోపాల రాజు, దత్తిరాజేరు పార్టీ మండల అధ్యక్షులు చప్పా చంద్రశేఖర్, ఆలయ నిర్వాహకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని గజపతినగరం గ్రామంలో ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలో నూతనంగా నిర్మించిన ప్రసన్న వెంకటేశ్వర స్వామివారిని మాజీ ఎమ్మెల్యే బొత్స బుధవారం దర్శించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి పల్లె స్వామివారి ఆశీస్సులతో పాడిపంటలతో తులతూగాలని ఆయన అన్నారు. కందుల చిన్నయ్య స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు ఆవుపాలతో స్వామివారికి అభిషేకం చేసి స్వామివారి ఆశీస్సులను పొంది ప్రసన్నం అయ్యారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మండల సురేష్, జడ్పిటిసి గార తవుడు, తుమ్మికాపల్లి మాజీ సర్పంచ్ బెల్లన త్రినాధరావు, గజపతినగరం ఎంపిటిసి -1 కర్రీ కళావతి, మధుపాడ మాజీ సర్పంచ్ పైడిపు నాయుడు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా గంగలపూడి గిరిధర్ రెడ్డి జన్మదిన వేడుకలు

## - చిందేపల్లిలో ఉచిత వైద్య, దంత పరీక్ష

## - 150 మందితో రక్తదాన శిబిరం



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం చిందేపల్లి గ్రామంలో వెలసిన శ్రీ ద్రాక్షాయని పార్వతీ సమేత సిద్ధేశ్వర స్వామి ఆలయ శాశ్వత ధర్మకర్త గంగలపూడి గిరిధర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం ఆలయ ప్రాంగణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గంగలపూడి గిరిధర్ రెడ్డి యువసేన ఆధ్వర్యంలో సహస్ర హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం, స్టార్ హెల్త్ సహకారంతో ఉచిత దంత పరీక్షలు, ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సుమారు 150 మంది పాల్గొని రక్తదానం చేయడంతో పాటు వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ గంగలపూడి గిరిధర్ రెడ్డి సోదరుడు గంగల పూడి పార్థసారధి రెడ్డి హాజరై కేక్ కట్ చేసి తన సోదరుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. యువత ఉత్సాహంగా కేక్ కటింగ్‌లో పాల్గొని గిరిధర్ రెడ్డి ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సేవా కార్యక్రమాలను డాక్టర్ గంగల పూడి గిరిధర్ రెడ్డి యువసేన సభ్యులు సమన్వయం చేసి విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.చంద్రశేఖర్, గంగలపూడి లోకేష్ రెడ్డి, గంగలపూడి సాయికుమార్ రెడ్డి, మోహన్ రెడ్డి, ఢిల్లీ తదితరులు పాల్గొన్నారు.

# గంటా రామకృష్ణకి వీరఘట్టం ఉపాధి హామీ ఉద్యోగులు సత్కారం



**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** వీరఘట్టం మండలం ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ గంటా రామకృష్ణకు క్లస్టర్ ఏపీడీ జి. శ్రీహరి మరియు ఏపీవో జి సత్యం నాయుడు సత్కరించారు. ఇటీవల అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో ఎస్సీ విభాగంలో ప్రథమ స్థానం, యోగా స్లోగన్ విభాగంలో ద్వితీయ స్థానం పార్వతీ మన్యంకి మరియు వీరఘట్టం మండలంకి రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకు వచ్చినందుకు మరియు దళితరత్న అవార్డును తెలంగాణ ప్రభుత్వం నుండి వచ్చినందుకు కవిగా, రచయితగా, సైకాలజిస్టుగా, యోగా జడ్జిగా అనేక రంగాల్లో బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు పొంది జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. మన వీరఘట్టం మండలంలోని టెక్నికల్ అసిస్టెంట్ పనిచేయడం మనందరికీ గర్వకారణం. గౌరవం అని ఏపీవో జి.సత్యం నాయుడు తెలిపారు. అవార్డు గ్రహీత గంటా రామకృష్ణ మాట్లాడుతూ కోడి రామ్మూర్తిలాంటి మహానుభావులు పుట్టిన వీరఘట్టం మండలం పని చేస్తున్నశీదుకు మరియు ఎంపీడీఓ, ఏపీవో సహాయ సహకారాలు మరియు ప్రోత్సాహం మరువలేనిది అని ఈ అవార్డులు ఏపీవోకి అంకితమిస్తున్నాని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈసీ కృష్ణ ప్రసాద్, హరి ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, సీవోలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**- ప్రతి గృహాన్ని సందర్శించి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి - ఎన్యుమరేషన్ ఫారాల్లో పూర్తి వివరాలు స్పష్టంగా నమోదు చేయాలి : జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** "సర్" - స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియను వేగవం తం చేయడంతో పాటు ప్రతి గృహాన్ని సందర్శించి ఓటర్ల వివరా లను క్షుణ్ణంగా పరిశీలించి, ఎన్యుమరేషన్ ఫారంలలో పూర్తి వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ బూత్ లెవెల్ ఆఫీసర్లను (బీఎల్వోలు) ఆదేశించారు. బుధవారం తూర్పు జోన్ పరిధిలోని వార్డు నెంబర్లు 17, 18, 19, 20, 21లో ఆదర్శనగర్-01 సెక్టార్ 3, 7, 10 పరిధిలోని సచివాలయం నెంబర్ 99, ఎంవీపీ-03 సెక్టార్ 6, 9 పరిధిలోని సచివాలయం నెంబర్ 100లను తూర్పు జోన్ జోనల్ కమీషనర్ కె.శివప్రసాద్, ఇఆర్ఓ సునీతలతో కలసి కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేసి "సర్" ప్రక్రియ పురోగతిని పరిశీలించారు. ఈ సం దర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లతో మాట్లాడి వారి వివరాలను సేకరించాలని, ఎలాంటి తప్పులు లేకుండా ఎన్యుమరేషన్ ఫారంలలో నమోదు చేయాలని సూచిం చారు. ఇప్పటి వరకు ఎన్ని ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేశారు, ఎన్ని పూర్తి చేశారు, ఎన్ని తిరిగి సేకరించారు అనే వివరాలను బీఎల్వోలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆయా సచివాలయాల పరిధిలో ఇప్పటివరకు ఎంతమంది వలస వెళ్లారు, కొత్తగా చేరిన ఓటర్లు ఎంతమంది ఉన్నారు, డూప్లికేట్ ఓటర్లు ఉన్నారా అనే అంశాలపై సమగ్ర వివరాలు సేకరించాలని ఆదేశిం చారు. బీఎల్వోలు గృహ సందర్శన సమయంలో ఓటర్ల స్పందన, వారి సహకారం ఏ విధంగా ఉందో కూడా కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. సర్ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనల ప్రకారం సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అలాగే సచివాలయ ఉద్యోగుల విధులు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమం వివరాలను అడిగి తెలుసుకుని ప్రజలు పి జె ఆర్ ఎస్‌లో పెట్టుకున్న దరఖాస్తులను ఏమైనా పెండింగ్ ఉన్నాయా అని ఆరా తీశారు. ప్రజలు పెట్టుకున్న దరఖాస్తులను వెనువెంటనే పరిశీలించాలని కార్యదర్శులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఆర్వో సునీత, ఈడిటి యామిని, బీఎల్వోలు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో 'బీచ్ షాక్స్' పై భగ్గుమన్న వైసీపీ

**- రోడ్డుపై మద్యం బాటిళ్లు వంపి భారీ నిరసన**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** బీచ్ షాక్స్ పేరిట బీచ్‌లో బార్లు ఏర్పాటు చేయడంపై వైసీపీ శ్రేణులు తీవ్రంగా మండిపడుతున్నారు. మద్యం పాలసీపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. దానిలో భాగంగా ఈరోజు దక్షిణ నియోజకవర్గం 41వ వార్డు వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్‌ల ఆధ్వర్యంలో జ్ఞానాపురం వద్ద భారీ నిరసన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రోడ్డుపైకి వచ్చి ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీచ్‌లో మద్యం సరఫరాను ప్రోత్సహించేలా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, దీనివల్ల నగరాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విశాఖపట్నంలాంటి ప్రశాంతమైన నగరాన్ని ఇప్పటికే గంజాయి హబ్‌గా మార్చేశారని, ఇప్పుడు 'లిక్కర్ సిటీ'గా మార్చేందుకు కుట్రలు చేస్తున్నారంటూ ఆరోపిం చారు. ఉపాధి, పెన్షన్ల ఊసులేకుండా మద్యం విక్రయాల ద్వారా వచ్చే పర్సంటేజీల కోసమే ప్రభుత్వం ఈ తరహా నిర్ణయాలు తీసుకుంటోందని విమర్శించారు. అనంతరం బీరు ధరలు పెట్రోల్, గ్యాస్ కంటే చౌకగా మారాయంటూ ప్లకార్డులతో నిరసన ప్రదర్శించారు. ప్రభుత్వం తక్షణమే తన మద్యం విధానాన్ని మార్చుకోకపోతే, ప్రజాగ్రహం తప్పదని హెచ్చరిస్తూ రోడ్డుపై మద్యం బాటిళ్లను వంపి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి నెల మూడవ శుక్రవారం "ఎంప్లాయ్ గ్రీవెన్స్ డే" నిర్వహణ

**- ఉద్యోగుల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక వేదిక - నిర్ణీత గడువులోగా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు : జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలో ప్రతి నెల మూడవ శుక్రవారం "ఉద్యోగుల ఫిర్యాదుల పరిష్కార దినోత్సవం" నిర్వహించనున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, జీవీఎంసీలో విధులు నిర్వహిస్తున్న ఉ ద్యోగులు తమకు సంబంధించిన సేవా అంశాలు, పరిపాలనా సమస్యలు, ఇతర ఫిర్యాదులను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రతి నెల మూడవ శుక్రవారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఓల్డ్ కౌన్సిల్ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. ఉద్యోగుల నుంచి స్వీకరిం చిన ప్రతి ఫిర్యాదును నిర్ణీత గడువులో పరిష్కరించేందుకు సంబం ధిత శాఖాధిపతులు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యల పురోగతిని నిరంతరం సమీక్షించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో జీవీఎంసీలో కూడా వాటిని సమర్థవం తంగా అమలు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. జీవీఎంసీ పరి



ధిలోని అన్ని శాఖాధిపతులు, జోనల్ కమిషనర్లు తమ పరిధిలోని ఉద్యోగులకు ఈ కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పించి, ప్రతి నెల నిర్వహించే ఉద్యోగుల ఫిర్యాదుల పరిష్కార దినోత్సవా నికి హాజరై ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. జీవీఎంసీ ఉద్యోగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను నేరుగా తెలియజేసి పరిష్కారం పొందాలని కమిషనర్ కోరారు.

# ఈనెల 10న మెగా జాబ్ మేళా - పోస్టర్లు ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 10వ తేదీన పెద్దాపురం మహారాణి కళాశాలలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసు కోవాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప తెలిపారు. సామర్లకోట మం డలం అచ్చంపేట తన నివాస కార్యాలయంలో బుధవారం సాయంత్రం జాబ్ మేళా క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్య త్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ జాబ్ మేళాలో సుమారు 1,500 ఖాళీలను భర్తీ చేయను న్నట్లు తెలిపారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, ఎలక్ట్రికల్, బ్యాంకింగ్ తదితర రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు పాల్గొననున్నాయని చెప్పారు. పదో తరగతి నుంచి పీజీ వరకు అర్హత కలిగిన అభ్యర్థులు హాజరు కావచ్చని, ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల నుంచి రూ.50 వేల వరకు వేతనం లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. జాబ్ మేళా విజయవంతం కోసం టీడీపీ కాకినాడ జిల్లా ఉపా ధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్, వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.




లచ్చారావు, వికాస సిబ్బంది సహకరిస్తున్నారని తెలిపారు. యువత తమ బయోడేటాతో పెద్దాపురంలోని సుధా కాలనీలో ఉన్న తెదేపా క్యాంపు కార్యాలయంలో జూలై 2 నుంచి 7వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నమోదు చేసుకోవచ్చని ఎమ్మెల్యే చినరాజప్ప తెలిపారు. మరిన్ని వివరాలకు 9701836008, 9494550866 నంబ ర్లను సంప్రదించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మెగా జాబ్ మేళాకు చెందిన క్యాలెండర్‌లను ఎమ్మెల్యే చినరాజప్ప తదితరులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా కాకినాడ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్, వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె లచ్చారావు, వికాస సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ డి.పి రావుకు డాక్టర్స్ డే శుభాకాంక్షలు



**కోట, (రాజధాని వార్తలు):** జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా కోట మండలం కోట ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ప్రముఖ వైద్యులు డా.డిపి రావును బహుజన యూత్ ఫోర్స్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు పూలమాలతో ఘనంగా సత్కరించి డాక్టర్స్ డే శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బహుజన యూత్ ఫోర్స్ నాయకులు మాట్లాడుతూ వైద్య సేవలను వృత్తిగా కాకుండా సేవా ధర్మంగా భావించి ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న డా.డిపి రావు సేవలు అభినంద నీయమని కొనియాడారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో వైద్యుల పాత్ర ఎంతో గొప్పదని, వారి సేవ లను ప్రతి ఒక్కరూ గౌరవించాలని అన్నారు. డా.డిపి రావు మాట్లాడుతూ, తనకు డాక్టర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన బహుజన యూత్ ఫోర్స్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బహుజన యూత్ ఫోర్స్ గౌరవ సలహాదారులు ఐవీ రమణయ్య, దాసరి సుందరం, కనుపూరు కృష్ణయ్య, షేక్ యస్థానీ కన్వీనర్ శ్రీరాం శివప్రసాద్ (శంకర్), మీడియా కో ఆర్డినేటర్ పాకం చెన్నకే శవలు, లీగల్ అడ్వైజర్ దాసరి అశోక్ కాంబ్లే, కో కన్వీనర్లు షేక్ సుభాన్ భాషా, దాసరి అరుణ్, జోరేపల్లి తేజ, బీవైఫ్ నాయకులు రంజిత్, కార్తీక్, శ్రీను, సుజిత్, అమర్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# డ్వాక్రా సంఘాల రూ.99.86 లక్షల నిధుల దుర్వినియోగం కేసులో ఇద్దరు మహిళల అరెస్ట్

**- 14 రోజుల రిమాండ్ విధించిన న్యాయస్థానం**




**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్, కరప మండలం కూరాడ గ్రామంలో స్వయం సహాయక సంఘాల నిధులను దుర్వినియోగం చేసిన కేసులో ఇద్దరు మహిళలను కరప ఎస్సై తోట సునీత, పోలీసు బృందం అరెస్ట్ చేశారు. వారిని న్యాయ స్థానంలో హాజరు పరచగా, న్యాయమూర్తి ఇద్దరికీ 14 రోజుల రిమాండ్ విధించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరప మండలం కూరాడ గ్రామానికి చెందిన చిన్నం ప్రియ భారతి వినియోగదారుల సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసి, కూరాడ-1, కూరాడ-2, చినమామిడాడ గ్రామాలకు చెందిన 74 స్వయం సహాయక సంఘాల సభ్యుల నుంచి పొదుపు, రుణాల చెల్లింపుల రూపంలో రూ.99,86,440 సేకరించారు. ఆ మొత్తాన్ని భారతీ య స్టేట్ బ్యాంకులో జమ చేయకుండా తన తల్లి చిన్నం మంగతో కలిసి స్వప్ర యోజనాలకు వినియోగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై (కాకినాడ డీఆర్‌డీఏ) జిల్లా గ్రామీణా భివృద్ధి సంస్థ-సెర్ప్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.శ్రీనివాసరావు ఇచ్చిన నివేదిక ఆధారంగా కరప పోలీస్ స్టేషన్‌లో టి.సునీత కేసు నమోదు చేశారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ బిందు మాధవ్ ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు బుధవారం ఉద యం కరప మండలం ఉప్పలంక గ్రామ శివారులో చిన్నం ప్రియ భారతి, చిన్నం మంగలను అరెస్ట్ చేశారు. అనంతరం వారిని కాకినాడ ప్రత్యేక ప్రథమ శ్రేణి న్యాయస్థానంలో హాజరు పరచగా, న్యాయమూర్తి ఎం.మాధవి ఇద్దరు నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై టి.సునీత తెలిపారు.

# ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి దంపతులు

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి పట్టణంలోని బజార్ వీధిలో ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయ ద్వితీయ ద్వాదశ వర్ష మహా కుంభాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా జరుగు తుంది. ఈ వేడుకల్లో శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఆయన సతీమణి బియ్యపు శ్రీవాణి రెడ్డి కలిసి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన బియ్యపు మధుసూదన్ రెడ్డి దంపతులకు శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం బజార్ వీధి పాలక మండలి అధ్యక్షులు జూలుగంటి మురళి, ఎం.జె.స్వరూప్, జాలాది మోహన్ బాబు, జూలుగంటి సుబ్బారావు, పేర్ల రమేష్ బాబు, మిచెల్లీ కార్తీక్, జూలు గంటి జగదీష్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అర్చ కులు వారికి వేదాశీర్వ చనం చేసి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాజి శరవణ కుమార్,



కంట ఉదయ్ కుమార్, మున్నా రాయల్, జయ శ్యామ్ రాయల్, లక్ష్మీపతి, ఫజల్, జి.వి.కె.రెడ్డి, నారాయణ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఏరియా ఆసుపత్రిలో న్యాయ విజ్ఞాన సదస్సు

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం ఏరియా ఆసుపత్రిలో జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా మండలం న్యాయ సేవాధి కార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు బుధవారం నిర్వహించారు. ఆసుపత్రి సూపరిండెంట్ రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో మండల న్యాయ సేవాధికార సంస్థ న్యాయ వాదులు మడికి రాంబాబు ఎస్ విశాలాక్షి గణేష్ పాల్గొని పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆసుపత్రిలో ఇన్ పేషెంట్ వార్డ్‌లో రోగులకు అందు తున్న వైద్య సదుపాయాలు, ఇతర అంశాలపై రోగులతో మాట్లాడి వారికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఉచిత న్యాయ సహాయం పొందగోరు వారు మండల న్యాయ సేవాధికార సంస్థ సిబ్బందిని సంప్రదిం చాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో




ఆసుపత్రి వైద్యులు డా.ఏ శ్రీనివాస్ డా.రాజు, డా.హర్షిత రాజా ఐసిటిసి కౌన్సిలర్ శ్రీనివాస్, హెడ్నర్స్ రమాదేవి, ఆరోగ్య మిత్రలు శేఖర్, జగపతి రాజు, పారా లీగల్ వాలంటీర్లు మాసా చంద్రరావు (చందు), కేవీపీ లక్ష్మి, డి లక్ష్మి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యన్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పాస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# స్పీడ్ పోస్ట్‌తో దేశవ్యాప్తంగా గంజాయి సరఫరా: సీపీ సజ్జనార్

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** దేశవ్యాప్తంగా స్పీడ్ పోస్ట్ ద్వారా గంజాయి సరఫరా చేస్తున్న ముఠాను అరెస్ట్ చేశామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. H- Fast అధికారులు, గుడిమల్కాపూర్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి నిందితుల్ని అరెస్ట్ చేశారన్నారు. గంజాయిను స్పీడ్ పోస్ట్ ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నారని.. జార్ఖండ్‌కు చెందిన సత్యం మిశ్రాను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఇంటర్ చదివిన సత్యం మిశ్రా పెయింట్ పని చేసి మానేశాడని.. ఆ తర్వాత లారీ డ్రైవర్‌గా పనిచేశాడన్నారు. 2018లో గంజాయికి అలవాటు పడ్డ మిశ్రా.. రాహుల్ జై, సచిన్ మిశ్రా, సంతోష్‌తో సిండికేట్‌గా ఏర్పడి.. సొంత ఊరిలోనే గంజాయి పంట వేశారని తెలిపారు. ఊరిలో చాలా మందితో గంజాయి పంట పండించి కొనుగోలు చేసి కస్టమర్లకు సరఫరా చేస్తున్నారని చెప్పారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారన్నారు. స్పీడ్ పోస్ట్, కొరియర్ సేవల ద్వారా 21 రాష్ట్రాలకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్, ముంబై, చెన్నై, ఢిల్లీ, బెంగళూరు సహా పలు నగరాలకు గంజాయి సరఫరా చేస్తున్నారని సజ్జనార్ తెలిపారు. పార్సిళ్లలో మందులు ఉన్నట్లు తప్పుడు డిక్లరేషన్ ఇచ్చి పోస్టల్ అధికారులను మోసగిస్తున్నారని.. ఇస్రీ బజార్, ఫుస్రో పోస్టాఫీసుల నుంచి స్పీడ్ పోస్ట్ ద్వారా పార్సిళ్లు బుక్ చేసినట్లు గుర్తించామన్నారు. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా ఆర్డర్లు తీసుకుని యుపిఐ ద్వారా నగదు లావాదేవీలు జరిగేవన్నారు. రోజుకు 80 -100 ఆర్డర్లు వస్తుండగా.. అందులో 8 నుంచి 10 వరకు స్పీడ్ పోస్ట్ పార్సిళ్ల ద్వారా గంజాయి పంపిణీ చేస్తున్నారన్నారు. ఒక్కో పార్సిల్‌లో 50 - 250 గ్రాముల గంజాయి ఉంచుతూ డెలివరీ చేస్తున్నారని.. ఒక్కో ప్యాకెట్ రూ. 1,500 నుంచి రూ.8,000 వరకూ విక్రయిస్తున్నట్లు తెలిపారు. రోజుకు సుమారు రూ.1 లక్ష ఆదాయం లభించగా.. నెలకు రూ.30 లక్షల నుంచి రూ.35 లక్షలు, ఏడాదికి రూ.4 కోట్ల



నుంచి రూ.5 కోట్ల టర్నోవర్ ఉందన్నారు. సరఫరాదారులు, కస్టమర్స్ మధ్య కోడ్స్ ద్వారా ఆన్‌లైన్ బుకింగ్ జరుగుతుందని తెలిపారు. వాట్సాప్‌లో వివిధ కోడ్స్ ద్వారా కస్టమర్స్ గంజాయి ఆర్డర్ చేస్తున్నారని అన్నారు. వచ్చిన డబ్బుతో నిందితులు బంగారం, లగ్జరీ వాహనాలు కొనుగోలు చేశారని సీపీ వెల్లడించారు. నిందితులు పలు బ్యాంక్ ఖాతాలు, ఫోన్ పే యుపిఐ ఐడీలతో మనీలాండరింగ్ చేసినట్లు గుర్తించామన్నారు. రైళ్లు, విమానాల ద్వారా వచ్చిన స్పీడ్ పోస్ట్ పార్సిళ్లకు స్కానింగ్ లేకపోవడంతో సరఫరా సులభమైందన్నారు. పోస్టల్ పార్సిళ్లకు తప్పనిసరి స్కానింగ్ అమలు చేయాలని కేంద్ర శాఖలకు లేఖ రాయనున్నట్లు తెలిపారు. ఎస్ఆర్ నగర్, గుడిమల్కా పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పార్సిల్‌పై అనుమానం కలిగి దర్యాప్తు చేశామని.. హైదరాబాద్‌కు వచ్చిన 2 పార్సిల్స్ ఫ్లైట్‌లోనే వచ్చాయన్నారు. నగరంలోని అన్ని కొరియర్ సంస్థలకు ప్రతి పార్సిల్‌ను తప్పనిసరిగా స్కాన్ చేయాలని ఆదేశాలు జారీ చేస్తానన్నారు. అనుమానాస్పద పార్సిళ్లు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

# నాగులవెల్లటూరులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

**చేజర్ల, (రాజధాని వార్తలు):** చేజర్ల మండలం నాగులవెల్లటూరు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాలు, కిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాళ్లూరి గిరినాయుడు సూచనల మేరకు సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ వేలూరు కేశవ చౌదరి కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్వర్ణ గ్రామ వార్డు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం కూలుతుందన్న డీఎంకే ప్రచారాన్ని కొట్టి పారేసిన తమిళనాడు సీఎం విజయ్

**చెన్నై:** తమిళనాడులో రాజకీయ సమీకరణాలు, ప్రభుత్వంపై వస్తున్న ఊహాగానాలకు తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే పార్టీ అధినేత విజయ్ గట్టి సమాధానమిచ్చారు. చెన్నైలో నిర్వహించిన మిత్రపక్షాల ఉన్నత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని, కూటమి నేతలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం కూలిపోతుందంటూ ప్రతిపక్షాలు, కొన్ని వర్గాలు చేస్తున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.




**పూర్తి కాలం అధికారంలో ఉంటాం**

తమ ప్రభుత్వానికి ఎలాంటి ముప్పు లేదని, ప్రజా తీర్పును గౌరవిస్తూ ప్రభుత్వం పూర్తి కాలం విజయవంతంగా కొనసాగుతుందని సీఎం విజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాజకీయంగా తమను దెబ్బతీయాలని చూసే వారి వ్యూహాలు ఫలించవని స్పష్టం చేశారు.


**సిద్ధాంతాలపై రాజీ పడేదే లేదు**

ప్రభుత్వ పనితీరు, కూటమి గమనంపై మాట్లాడిన ముఖ్యమంత్రి, తమ ప్రయాణంలో రెండు ప్రధాన సూత్రాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించారు. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేయకుండా, పారదర్శకమైన పాలన అందించడమే తమ లక్ష్యమన్నారు. అన్ని వర్గాల ప్రజలను సమానంగా చూస్తూ, లౌకికవాద విలువలను కాపాడతామని చెప్పారు. 'అవినీతిరహిత పాలన, లౌకికవాదం అనేవి మా ప్రభుత్వానికి రెండు కళ్లు. ఈ రెండు కీలక అంశాల్లో ఎలాంటి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదు' అని విజయ్ స్పష్టం చేశారు.

**మిత్రపక్షాలకు పిలుపు**

కూటమిలోని భాగస్వామ్య పక్షాలన్నీ మరింత సమన్వయంతో ముందుకు సాగాలని సీఎం పిలుపునిచ్చారు. మిత్రపక్షాలన్నీ ఐక్యంగా ఉంటూ, కేవలం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలని కోరారు. రాజకీయ విమర్శలను పక్కనబెట్టి, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే అందరి ముందున్న ఏకైక లక్ష్యం కావాలని ఆయన దిశా నిర్దేశం చేశారు.

# కరప మండలంలో 90 శాతం పెన్షన్లు పంపిణీ



**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్, కరప మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో బుధవారం మొత్తం 90.18 శాతం పంపిణీ విజయవంతంగా పూర్తయ్యిందని మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) జటావల్ల భుల్ల శ్రీనివాస్ తెలిపారు. కరప మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో 21 సచివాలయాల ద్వారా 11,059 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.4.07 కోట్లుల పంపిణీ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలో జూలై ఒకటో తేదీ 9,973 మంది లబ్ధిదారులకు రూ. 4.29 కోట్లు వారి నివాసాలకే సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, ఇతర సిబ్బంది ద్వారా పంపిణీ చేశారన్నారు. బుధ వారం అందుబాటులో లేని పెన్షన్లుదారులకు గురువారం అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, కూటమి నాయకులు, ఇతర ప్రభుత్వ అధికారులు పింఛన్లను లబ్ధిదారులకు చేరువ చేయడంలో ముఖ్య పాత్ర పోషించారని ఎంపీడీవో జె శ్రీనివాస్ తెలిపారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan